

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV — STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 232 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం, 22, జులై 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# దేశం రక్తసిక్తం !



దేశ యువతపై దాడులు

పోలీసుల లాఠీలతో గుండాలు

ప్రజాస్వామ్యాన్ని సర్వనాశనం చేస్తున్నారు

కేంద్ర ప్రభుత్వానికి నూకలు చెల్లుబాటు

దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై దాడి అమానుషం

తీవ్రంగా ఖండిస్తున్నాం

ఆడపిల్లలపై రక్తంకారేలా దాడులు చేశారు

పోలీసుల ముసుగులో ఆర్ఎస్ఎస్ గుండాల దాడులు !

దేశంలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది

యువతను అవమానించి రెచ్చగొట్టింది బిజెపి కాదా

బిజెపి పెద్దలు దేశ యువతను చిత్రవధ చేస్తున్నారు

సివిల్ యూనిఫాంలో కర్రలు పట్టుకొని లాఠీచార్జ్ చేస్తున్నదెవరు

మొండిపట్టులో బిజెపి రక్తపు మడుగులో విద్యార్థులు !

దేశ యువతపై బిజెపిది కర్కష ప్రదర్శన : డాక్టర్ బరిగెల శివ

దేశంలో విద్యార్థి ఉద్యమాలపై జరుగుతున్న పోలీసు చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని జై భీమ్ సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో జరిగిన ఘటనలను ఆయన తీవ్రంగా ఖండించారు. నిరసన తెలిపే హక్కును అణచివేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఘటనపై స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి బలప్రయోగం చేయడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఆయన కోరారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## హైడ్రా తరహాలో మరో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థ?

ఆదాయ లీకేజీల నివారణకు ప్రభుత్వ కసరత్తు

కీలక శాఖలపై సమగ్ర నిఘా ఏర్పాటు యోచన

అక్రమాలు, అవినీతిపై ప్రత్యేక దృష్టి

అన్ని ఆదాయ శాఖలను ఒకే వేదికపైకి తేనున్న ప్రతిపాదన

ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు



2

## వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ

ఎల్‌నీనో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

వరికి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

దేవాదుల మోటార్ల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం

తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలకు ఆదేశం




5

## నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా

వారికి కనీసం రూపాయి కూడా పరిహారంగా ఇవ్వరా

కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

పార్టీ తరపున ఒక్కో కుటుంబానికి 5 లక్షల సాయం అందచేత



2

## అసోంను ముంచెత్తిన వరదలు

- భారీ వర్షాలకు జనజీవనం అతలాకుతలం - పదిమంది మృతి..లక్షలాది మంది నిరాశ్రయులు

గౌహతి,జూలై21(జై భీమ్ న్యూస్): అస్సాంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. భారీ వానల కారణంగా ఇప్పటివరకు 10 మంది మృతిచెందగా, లక్షల మంది నిరాశ్రయులయ్యారు. వర్షాలకు అస్సాం రాష్ట్రవ్యాప్తంగా 16 జిల్లాల్లో 794 గ్రామాలు ప్రభావితమయ్యాయి. శివసాగర్, చరైడియో, జోర్హాట్, దిబ్రూఘర్, సోనిత్‌పూర్, బిస్వనాథ్, గోలాఘాట్, ధేమాజీ, తిన్‌సుకియా, నాగావ్, కర్బీ అంగ్లాంగ్, కాచర్, ఉదల్‌గురి, చిరాంగ్, కమ్‌రూప్, కమ్‌రూప్ (మెట్రో) జిల్లాలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ఆయా జిల్లాల్లో మొత్తం 3.62 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాయి. అధికారులు 101 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. మరోవైపు భారీ వర్షాలతో నదులకు వరదనీరు పోటెత్తుతోంది. నేమతిఘాట్ వద్ద బ్రహ్మపుత్ర, చెనిమారి (ఖోవాంగ్) వద్ద బుర్హిదిహింగ్, నాంగ్లాముఠాఘాట్ వద్ద దిసాంగ్, నుమాలిగఢ్ వద్ద ధన్‌సిరి (దక్షిణ), శివసాగర్ వద్ద దిఖౌ నదులు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు వరదనీరు జనావాసాల్లోకి వచ్చింది. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అనేక రోడ్లు దెబ్బతిన్నాయి. వర్షాలకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. దాదాపు 19,100 హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. మరోవైపు, అస్సాంలోని కొన్ని ప్రాంతాల్లో మరింత వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ మేరకు చెరువులు, నదుల నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అలాగే ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు అధికారుల సూచనలను పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచిస్తున్నారు.



# హైడ్రా తరహాలో మరో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థ?

### ప్రభుత్వ ఆదాయ లీకేజీల అరికట్టడమే లక్ష్యంగా కసరత్తు

**హైద్రాబాద్, 21 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణలో ప్రభుత్వ ఆదాయానికి జరుగుతున్న లీకేజీలను అరికట్టేందుకు హైడ్రా తరహాలో మరో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర ఆదాయం ఆశించిన స్థాయిలో పెరగకపోవడంతో ఆదాయ వనరులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. వాణిజ్య పన్నులు, గనులు, పౌర సరఫరాలు, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ వంటి కీలక శాఖల్లో ఆదాయ నష్టాన్ని నివారించడంతో పాటు అక్రమాలు, అవినీతిని అరికట్టేందుకు అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ఒకే ప్రత్యేక నిఘా, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు సమాచారం. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే అక్రమ కార్యకలాపాలను గుర్తించడం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం ఈ ప్రత్యేక విభాగం ప్రధాన లక్ష్యంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవస్థ ఏర్పాటైతే వివిధ ఆదాయ శాఖల కార్యకలాపాలపై కేంద్రీకృత నిఘా మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే, అన్ని కీలక శాఖలపై ఒకే ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తే ఆయా శాఖలపై సంబంధిత మంత్రుల పర్యవేక్షణ, నిర్ణయాధికారం తగ్గే అవకాశం ఉందని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కీలక శాఖల పర్యవేక్షణ నేరుగా ముఖ్యమంత్రి కనుసన్నల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడవచ్చని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రత్యేక సంస్థ ఏర్పాటు, దాని అధికారాలు, పరిధిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# మల్లికార్జున ఖర్గేకు ఎర్రబెల్లి స్వర్ణ జన్మదిన శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ, 21 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీలోని ఖర్గే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన ఎర్రబెల్లి స్వర్ణ పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఖర్గే సంపూర్ణ ఆరోగ్యంతో, ఆనందంగా, దీర్ఘాయుష్షుతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమై దేశ ప్రజలకు విశిష్ట సేవలు అందించాలని అభిలషించారు.

# నలుగురు రైతులు చనిపోయినా బాధ్యత లేదా

### వారికి కనీసం రూపాయి కూడా పరిహారంగా ఇవ్వరా
### కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన బిఆర్ఎస్ నేత కెటిఆర్
### పార్టీ తరఫున ఒక్కో కుటుంబానికి 5 లక్షల సాయం అందచేత

**ఆదిలాబాద్,జూలై21(జై భీమ్ న్యూస్):**

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెచ్చిన ధాన్యం 30 రోజులు, 60 రోజులైనా కొనేటోడు దిక్కు లేదు.. సంచులు ఇచ్చేటోడు దిక్కులేదు. ఈ దిక్కు దివానం లేని ప్రభుత్వంలో అన్నదాతకు దిక్కులేని పరిస్థితి వస్తే ఆ పంటను కాపాడుకునే ఆ కొనుగోలు కేంద్రం దగ్గరే కాపు కాసి ఉన్నప్పుడు గోడ కూలి నలుగురు రైతులు చనిపోయారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పంట కొనకపోవడం వల్ల గోడ కూలి ప్రాణాలు కోల్పోయిన నలుగురు రైతుల కుటుంబాలకు కేటీఆర్ ఆర్థిక సాయం అందించారు. మే 6న లక్షెట్టిపేట మండలంలో పంటలు కాపాడుకునేందుకు వెళ్లి మృత్యువాత పడిన నలుగురు రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. నలుగురు రైతులు చనిపోతే వారికి న్యాయం చేయాలని మా బీఆర్ఎస్ నాయకులు జీవన్ రెడ్డి, దివాకర్ రావు 8 గంటలు ధర్నా చేసినా.. దున్నపోతు మీద వాన పడ్డట్లు ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. చివరికి ఏదో మొక్కుబడిగా ఒప్పుకున్నారు.. చూస్తాం.. చేస్తాం అని ఒప్పుకున్నరు.. కానీ ఈ రోజు వరకు దాదాపు 2 నెలలు గడిచిపోయినా స్పందన లేదు. కనీసం మానవత్వం అనే ఆలోచన కూడా లేదు. ఈ నలుగురు జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయిన తర్వాత నాకు దివాకర్‌రావు, జీవన్ రెడ్డి కలిసి ఫోన్ చేశారు. అన్నా పార్టీ తరఫున మనమైనా ఏమన్నా చెప్పాలే.. ఎందుకంటే రైతులు ఇలా ఇబ్బంది పడుతున్నారు.. వారికి అండగా నిలబడాలన్నారు. ఆ రోజు మేం వరంగల్‌లో ఉన్నం.. రైతు సంగ్రామ సదస్సు నిర్వహిస్తున్నాం. అదే రోజు ఈ బాధాకరమైన సంఘటన జరిగింది. వెంటనే కేసీఆర్‌ను అడిగినం. మంచిర్యాల జిల్లాలో జరిగిన ఈ విషాదానికి పార్టీ తరఫున తప్పకుండా మనం అండగా నిలబడదాం.. ఒక్కో రైతుకు రూ.5 లక్షలు వెంటనే ప్రకటించాలని కేసీఆర్ చెప్పారన్నారు. ఇవాళ శోకసంద్రంలో ఉన్న రైతు కుటుంబాలను నేను అడిగిన. ప్రభుత్వం నుంచి ఏమన్నా వచ్చిందా అమ్మా అని అడిగిన. రెండున్నర నెలలు అయిపోయింది.. మంచిర్యాలలో ఉన్నది కాంగ్రెస్ ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం. జరిగింది ఒక విషాదం.. ఏ రాజకీయ పరమైన హడావిడి లేదు.. ఏ ఆర్భాటం లేదు.. ఏ ఎన్నిక లేదు.. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదు. నలుగురితో మాట్లాడుతుంటే ఒక్కొక్కరిది ఒక్కో బాధ. వాళ్లందరు చెప్పింది ఒక్కటే మాట.. ఇవాళ నలుగురు రైతులు చనిపోతే ఒక్క రైతుకు మాత్రమే రూ.5 లక్షలు వచ్చింది. అది కూడా ఎక్కడిది.. కేసీఆర్ పెట్టిన రైతు బీమా నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. కానీ మిగిలిన ముగ్గురికి రూ.5 లక్షలు కాదు కదా.. రూ.5 వేలు కాదు.. 5 పైసలు కూడా ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని కేటీఆర్ మండిపడ్డారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చేరకున్న కేటీఆర్ లక్షెట్టిపేట సమీపంలోని అంకతిపల్లిలోని వాసవీ ఫంక్షన్‌హాలుకు చేరుకుని రైతు సదస్సులో పాల్గొన్నారు.

# దేశంలో రక్తసిక్తం

### దేశ యువతపై దాడులు
### పోలీసుల లాఠీలతో గుండాలు
### ప్రజాస్వామ్యాన్ని సర్వనాశనం చేస్తున్నారు
### కేంద్ర ప్రభుత్వానికి నూకలు చెల్లుబాటు
### దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై దాడి అమానుషం
### తీవ్రంగా ఖండిస్తున్నాం
### ఆడపిల్లలపై రక్తంకారేలా దాడులు చేశారు
### పోలీసుల ముసుగులో ఆర్ఎస్ఎస్ గుండాల దాడులు !
### దేశంలో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది
### యువతను అవమానించి రెచ్చగొట్టింది బిజెపి కాదా
### బిజెపి పెద్దలు దేశ యువతను చిత్రవధ చేస్తున్నారు
### సివిల్ యూనిఫాంలో కర్రలు పట్టుకొని లాఠీచార్జ్ చేస్తున్నదెవరు
### మొండిపట్టులో బిజెపి రక్తపు మడుగులో విద్యార్థులు !
### దేశ యువతపై బిజెపిది కర్కష ప్రదర్శన
### డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

దేశ యువతను చిత్రవధకు గురి చేయడం భరించరాని నేరమని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు.దేశం నలువైపులా ఐక్యతను చాటుతున్న యువత దేశ రక్షణ కోసం చేస్తున్న పోరాటం తీవ్రమైన ఉద్రిక్తతకు దారితీయగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని రెండు నెలలుగా దేశవ్యాప్తంగా నిరసనతో కూడిన ఉద్యమాలు నడుస్తుండగా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల కర్కశంగా ప్రవర్తించిందే తప్ప విద్యార్థి మేధావులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించలేక పోయిందని తీవ్రంగా విమర్శించారు.దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు ఉద్యమ రూపం దాల్చి భారతదేశానికి ప్రధాన ఉద్యమ కేంద్ర బిందువైన ఢిల్లీలోని జంతర్ మంతర్ ప్రాంతంలో ఉవ్వెత్తున ఉద్యమాలు చేస్తుండగా ఒక్కసారిగా ఆక్రోషానికి గురైన కేంద్ర ప్రభుత్వం కేంద్ర పోలీసు బలగాలను మోహరింపజేసి ధర్నా చేస్తున్న విద్యార్థులపై విచక్షణారహితంగా దాడులు చేయించడమే కాకుండా రక్తాలు కారేల కొట్టించి దేశ పరువును దిగజార్చారని హెచ్చరించారు.ధర్నాలు చేస్తున్నది విద్యార్థి మేధావులన్న సంగతిని పూర్తిగా మర్చిపోయిన కేంద్ర ప్రభుత్వం దేశ విద్యార్థులను తీవ్రవాదుల కన్నా హీనంగా పరిగణించి దేశంలో ఎప్పుడూ జరగలేని విధంగా చరిత్ర హీనతకు దారితీసిందని పేర్కొన్నారు.విద్యార్థులపై రక్తాలు కారేల దాడులు చేస్తున్న కేంద్ర పోలీస్ బలగాలలో సివిల్ డ్రెస్సుల్లో ఉన్నటువంటి ఆర్ఎస్ఎస్ గుండాలు విద్యార్థులను చితక్కొట్టారని దేశంలోని మేధావి విద్యార్థులపై బిజెపి ఆర్ఎస్ఎస్ ఇంతలా దాడులు చేయడం దారుణం అన్నారు.దేశంలో విద్యార్థి మేధావుల పట్ల బిజెపి నిజాయితీ ఒక్కసారిగా బయటపడిందని కేంద్ర ప్రభుత్వ సన్నిహిత సంస్థగా పేరు చెప్పుకునే రిజిస్ట్రేషన్ లేని సంస్థ ఆర్ఎస్ఎస్ తో చేతులు కలిపి కేంద్ర పోలీస్ బలగాల ముందే ఆర్ఎస్ఎస్ వ్యక్తులచే విద్యార్థులను విపరీతంగా దాడులు చేయించారని దీనిపై సమగ్ర విచారణ జరిపి ఎవరిపై చర్యలు తీసుకుంటారో లేదో తెలియదు గాని కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో లాటి చార్జి చేసిన అసాంఘిక శక్తులు ఎవరో వాళ్ళు ఎందుకు ధర్నాలో చొరబడి విద్యార్థి మేధావులను కర్కషంగా కొట్టారో వాళ్ళ వివరాలు వాళ్ళ ఆధారాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

**మేధావుల దాడిలో రక్తపుటేరులు..**

జంతర్ మంతర్ దగ్గర జరుగుతున్న ధర్నాకు ప్రపంచవ్యాప్తంగా మీడియా సంస్థలు సహకరిస్తుండగా విద్యార్థులు చేస్తున్న ధర్నాపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం అడుగడుగునా ధర్నా స్థలాన్ని కేంద్ర పోలీస్ బలగాల గుప్పెట్లోనికి తీసుకోవడం అన్నీ అనుకున్నట్లుగా జరిగించుకున్న కేంద్ర ప్రభుత్వం విద్యార్థి మేధావులు చేస్తున్న ధర్నా పట్ల దేశవ్యాప్తంగా లక్షలాది కోట్లాదిమంది విద్యార్థులతో సంఘీభావం ఏర్పడుతుందని గమనించి విద్యార్థులకు దక్కుతున్న గౌరవాన్ని చూసి తట్టుకోలేని కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా దాడులకు పాల్పడి విద్యార్థినీ విద్యార్థులను రక్తాలు కారేలా కొట్టించారని అలా కొట్టిన వాళ్లలో కేంద్ర పోలీసు బలగాలే కాకుండా ఆర్ఎస్ఎస్ గుండాలు ఎందుకు చొరబడ్డారంటూ కారణం లేకుండా విద్యార్థులను ఎందుకు దాడులు చేయించారంటూ కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా నిలదీశారు.కేంద్ర మంత్రులు విద్యార్థుల ధర్నాపై పార్లమెంట్లో చర్చకు ఆహ్వానించామంటూ ప్రతిపక్షాల నేతలను గొంతు నొక్కేస్తూనే విద్యార్థులకు ధర్నాకు సంఘీభావం తెలుపనివ్వకుండా, సహకరించనివ్వకుండా పూర్తిస్థాయిలో అడ్డుపడి కేంద్ర ప్రభుత్వ ఉగ్రరూఢీ అనిచివేతను నిరూపించుకున్నారని హెచ్చరించారు.యువతను మేధావులను ఉగ్రవాదుల్లాగా చి త్రీకరించిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనంటూ హెచ్చరించారు.విద్యార్థులపై జరుగుతున్న లాటిదెబ్బలను,విద్యార్థుల శరీరాలపై నుండి కారుతున్న రక్త బిందువులను చూసి తట్టుకోలేని దేశ యువత లక్షల సంఖ్యలో జంతర్ మంతర్ చేరుకున్నారని అదే సందర్భంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ ధర్నాలో పాల్గొనగా దేశంలో ఒక్కసారిగా తీవ్రమైన ఉద్రిక్తత వాతావరణం ఏర్పడిందని దేశ యువత ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తట్టుకోలేని అరాచక శక్తులు ఏకంగా దేశ ప్రధాన ప్రతిపక్ష నేతపై దాడికి పాల్పడడం అక్కడ ఉన్నటువంటి ఉన్నత పోలీసు బలగాలు వారిని నివారిస్తూ విద్యార్థులకు సంఘీభావంగా రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహిస్తున్న రాహుల్ గాంధీని తక్షణపాటుగా అరెస్టు చేసి అదుపులోనికి తీసుకున్నారని అదే సందర్భంలో రాహుల్ గాంధీ ముఖంపై రక్త బిందువులు కనబడడం తీవ్రమైన బాధాకరమన్నారు.భారతదేశంలో నిరసనలు తెలపాలంటే రక్తాలు కారేల లాఠీ దెబ్బలు తినాలా అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా నిలదీశారు.ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్నందువల్లనే జంతర్ మంతర్ ఉద్యమాన్ని కేంద్ర పోలీసు బలగాల పహారాలోనికి తీసుకోని లాఠీ చార్జీలు వేయించారని హెచ్చరించారు. 12 సంవత్సరాలుగా విద్యా వ్యవస్థను తీవ్రమైన పతనావ్యస్యలోనికి నెట్టివేసిన కేంద్ర ప్రభుత్వం దేశంలోనే విద్యా హక్కులను కాలరాస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటాలు ఆడుతుందని పసిగట్టిన విద్యార్థి మేధావులు కేంద్ర ప్రభుత్వాన్ని ఎలాగైనా నిలదీయాలని దేశంలోని విద్యా వ్యవస్థను కాపాడుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తూ దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే విద్య ఒక్కటే మార్గం అని గమనించిన మేధావులంతా కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ఢీకొనడానికి కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని కోటగా నిలదీస్తూ ప్రాణాలు పోయేంతల దాడులను ఎదుర్కొంటున్నారని వాటి పరిణామం కేంద్ర ప్రభుత్వ రాజకీయాలను కేంద్ర ప్రభుత్వ అధికారాన్ని చిన్న భిన్నం చేసే స్థాయికి చేరిపోయిందన్నారు.రాహుల్ గాంధీ విద్యార్థులను రెచ్చగొడుతున్నారని అదే నేపథ్యంలో సుమారుగా రెండు నెలల తర్వాత దేశ ప్రధాని నరేంద్ర మోడీ మొదటిసారి ప్రకటన చేయడం రాజకీయ దుమానం లేపిందని విద్యార్థుల ప్రధాన డిమాండ్ల పట్ల స్పందించని దేశ ప్రధాని విద్యార్థులు చేస్తున్న ధర్నాకు సంఘీభావం తెలుపుతూ ప్రత్యక్షంగా నాలో పాల్గొన్న రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కార్యాలయాన్ని ముట్టడి చేయడం కోసం చేసిన ప్రయత్నంలో భాగంగా ప్రధాని మోడీతో పాటు కేంద్ర మంత్రులు ఢిల్లీ ప్రభుత్వం విద్యార్థుల రక్తాన్ని కళ్ళ చూసిందన్నారు.చివరకు రాహుల్ గాంధీ లాంటి ప్రధాన ప్రతిపక్ష నేత ముక్కులో నుండి రక్తం కారడం గమనిస్తుండగా ఈ దేశంలో ప్రజాస్వామ్యం అనేది ఉందా అంటూ ప్రపంచ దేశాలు భారత దేశ రాజకీయాలను నిలదీస్తున్నాయన్నారు.త్వరలో దేశ రాజకీయ నాయకులకు నేపాల్ పరిస్థితి ఎదురు కాబోతుందని హెచ్చరికలు జారీ చేశారు.దేశవ్యాప్తంగా ఉన్నటువంటి మేధావులు అందరూ విద్యార్థులందరూ కోట్ల సంఖ్యలో ఏకమవుతున్నారని గుర్తు చేశారు.నియంతల దాడులను తట్టుకొని ప్రాణాలను లెక్కచేయకుండా రక్తాలు కారుతున్న ఉద్యమాలు చేస్తున్న మేధావులను చూసి ప్రపంచ చిత్రపటం ఎంతో గర్విస్తుందన్నారు.జాతీయ విద్యను సమూలంగా నాశనం చేసే క్రమంలో భాగంగానే విద్యార్థులు చేస్తున్న ధర్నాను తీవ్రంగా అణచివేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ఉసురుపోసుకుంటుందని హెచ్చరించారు.లాటీలు పట్టుకొని కిరాతకంగా విద్యార్థులపై దాడులు చేసిన ఆర్ఎస్ఎస్ గుండాలను కఠినంగా శిక్షించాలని అన్నారు.దేశవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ లేని ఆర్ఎస్ఎస్ సంస్థలను నడుపుతున్న మేధావులారా విద్యార్థులు తలపెడుతున్న ఉద్యమ తీవ్రతను రక్తసిక్తమైన జంతర్మంతర్ ప్రాంతాన్ని చూసి సిగ్గు తెచ్చుకోండంటూ హెచ్చరించారు.దేశంలో ఏ వ్యవస్థలో చూసిన లక్షల రూపాయల జీతాలు తీసుకునే ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ అధికారులే దగుల్బాజీలుగా మారిపోయి ఆర్ఎస్ఎస్ ముసుగు వేసుకొని విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై ధర్నా నిర్వహిస్తే ఆర్ఎస్ఎస్ వ్యక్తులకు ఏం సంబంధం అంటూ అక్రమ పద్ధతిలో పోలీస్ లాఠీకర్రలు పట్టుకొని ధర్నాలో చొరబడి విద్యార్థులను రక్తాలు కారేలా కొట్టాల్సిన పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయి అంటూ నిలదీశారు. అసలు కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ జంతర్ మంతర్ ధర్నాకు పెరుగుతున్న మద్దతును చూసి తట్టుకోలేని ఆర్ఎస్ఎస్ గుండాలు కేంద్ర పోలీసు బలగాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ రక్షణ న్యాయస్థాన చట్టాలకు వ్యతిరేకంగా సంబంధం లేని సమస్యలో తలదూర్చి విద్యార్థులను రక్తాలు కారేలా కొట్టిన సందర్భాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోల ఆధారంగా వ్యక్తులను విద్యార్థులపై దాడులకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి వాళ్ళను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.దేశంలో జరుగుతున్నది మేధావుల పోరాటమా ప్రభుత్వాలు సృష్టిస్తున్న ఉగ్రవాదుల దాడుల రూపమా ఎటు తేల్చుకోలేని పరిస్థితిలో దేశ యువత ఉన్నారని వాళ్ళందరినీ ఏకతాటి మీదికి తీసుకువస్తూ దేశ భవిష్యత్తును దేశ విద్యా సామ్రాజ్యాన్ని రక్షించుకోవడానికి పాటుపడుతున్న ఉద్యమ నాయకులు దేశంలోని విద్యార్థులందరూ కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిపై దద్దరిలే పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ పీఠాన్ని గడగడలాడిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని వణికిస్తున్న మేధావులు మీడియా సంస్థల యాజమాన్యాలపై గుర్రుగా ఉన్నాయని తీవ్రంగా హెచ్చరించారు.విద్యార్థులు తలపెడుతున్న ఉద్యమాన్ని సోషల్ మీడియా ప్రపంచం చుట్టుముట్టేలా చేస్తుందని విద్యార్థుల ధర్నా విజయవంతం అయ్యే వరకు జై భీమ్ సంస్థ తరఫున పూర్తి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వ ఆగడాలను ఎండగడతామని హెచ్చరించారు.దేశ ప్రజలారా తెలుగు రాష్ట్రాల మేధావులారా బిజెపి అరాచక దాడులపై స్పందించండి అంటూ నిలదీశారు.

# సిజెపి ఆందోళన వెనక కుట్ర కోణం?

### ప్రాణాలకు తెగించి రావాలని సందేశాలు
### ప్రాణత్యాగాలు చేసిన వారిని గుర్తుంచుకుంటాం
### సీక్రెట్ యాప్‌తో పరస్పరం సందేశాలు చేరవేత
### సంసద్ యాత్రపై కూపీ లాగుతున్న పోలీసులు

**న్యూఢిల్లీ,జూలై21(జై భీమ్ న్యూస్):**

దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం చేపట్టిన చలో సంసద్ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడం ఒక ఎత్తయితే..వారి ఆందోళనల వెనక ఉన్న కుట్ర కోణాలను పోలీసులు కూపీ లాగుతున్నారు. సోమవారం నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఈ ఘటనలో పలువురు నిరసనకారులు తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం కూడా పరిస్థితులు ఉద్రిక్తంగానే ఉన్నాయి. దీంతో రాజధానిలో హై టెన్షన్ నెలకొంది. మరోవైపు విపక్ష పార్టీలు ప్రధాని మోడీ నివాసం ఎదుట నిరసనకు దిగారు. సర్వత్రా టెన్షన్.. టెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది. అయితే తాజాగా పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సీజేపీ నిరసన హింసాత్మకంగా మారడానికి భారీ కుట్ర జరిగినట్లుగా పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయి. సోమవారం ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలు పూర్తిగా నిలిచిపోయినా పెద్ద ఎత్తున నిరసనకారులు ఎలా రాగలిగారు అన్న దానిపై ఆరా తీస్తున్నారు. ఈ సందర్భంగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిరసనకారులు పరస్పరం సందేశాలు పంపించుకున్నట్లు కొన్ని చాట్ సందేశాలు వెలుగులోకి వచ్చాయి. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయినా పరస్పరం సంప్రదింపులు కొనసాగించేందుకు బ్లూటూత్ ఆధారిత 'సీక్రెట్ యాప్' వినియోగించినట్లుగా తేటతెల్లమైంది. అంతేకాకుండా కొంతమంది ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండాలని సందేశాలు పంపించుకున్నారు. ప్రస్తుతం ఈ సందేశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చాట్‌ల వెనుక ఉన్న రహస్యం, వాటిని పంపిన వ్యక్తుల గుర్తింపును ధృవీకరించే పక్రియ కొనసాగుతోంది. అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. పోలీసుల దర్యాప్తులో భాగంగా బయటకు వచ్చిన చాట్‌లలో.. నిరసన ప్రాంతానికి చేరుకున్న తర్వాత మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేకపోవచ్చని హెచ్చరికలు ఉన్నట్లు సమాచారం. గతంలో కూడా పోలీసులు నెట్‌వర్క్ జామర్లు ఉపయోగించారని, ఈసారి కూడా అదే జరిగే అవకాశం ఉందని పేర్కొంటూ ప్రత్యామ్నాయ కమ్యూనికేషన్ మార్గాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఒక సందేశంలో.. 'నిరసన ప్రాంతానికి వెళ్లాక ఫోన్ నెట్‌వర్క్ ఉండకపోవచ్చు. అందుకే ముందుగానే అందరూ ఒకే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని కనెక్ట్ అవ్వాలని సూచించినట్లు పోలీసులు గుర్తించారు. బ్లూటూత్ సిగ్నల్ ఆధారంగా పనిచేసే కొన్ని యాప్‌ల లింకులను కూడా అదే గ్రూపులో షేర్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ యాప్‌లపై సైబర్ నిపుణులు సాంకేతిక విశ్లేషణ చేస్తున్నారు. చాట్‌ల్లో తీవ్ర రాజకీయ హెచ్చరికలు కూడా ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. ఒక సందేశంలో రేపే మోడీ ప్రభుత్వానికి చివరి రోజు అని ఉంది. మరోవైపు కొందరు నిరసనకారులు ఉద్యమం కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఒక సందేశంలో.. ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నవారు గుర్తుంచుకోండి.. మీ త్యాగాన్ని భావితరాలు గుర్తుంచుకుంటాయి.' అని ఉండగా.. మరో సందేశంలో 'ఎవరైనా చనిపోతే ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయాలేనా? లేక నిరసనలను హింసాత్మకంగా మార్చేందుకు ముందస్తు వ్యూహంలో భాగమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చాట్ సందేశాలతో పాటు సీసీటీవీ ఫుటేజ్, డ్రోన్ వీడియోలు, మొబైల్ ఫోన్ వీడియోలు, ఇతర డిజిటల్ ఆధారాలను కూడా ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు అధికారులు తెలిపారు. పోలీసుల ప్రకారం.. ప్రతి డిజిటల్ సందేశాన్ని సాంకేతికంగా ధృవీకరించిన తర్వాతే సాక్ష్యంగా పరిగణిస్తామని, దర్యాప్తులో లభించే ఆధారాల ఆధారంగానే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ప్రతి విద్యార్థిని జ్ఞానవంతునిగా తీర్చిదిద్దడమే ఉన్నత విద్యాసంస్థల లక్ష్యం







కేయూ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి

**కేయూ క్యాంపస్, 21 జులై 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రతి విద్యార్థిని జ్ఞానవంతునిగా, సమాజానికి ఉపయోగపడే పరిశోధకుడిగా తీర్చిదిద్దడమే ఉన్నత విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ సెనెట్ హాలులో ఉన్నత విద్యాభివృద్ధి పథకం రెండో విడత ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ పరిశోధన ప్రాజెక్టుల పరిశోధన సహచరులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి ఉన్నత విద్యాభివృద్ధి పథకం నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, చేపడుతున్న పరిశోధనల ద్వారా నాణ్యమైన ఫలితాలు వెలువడాలని, అంతర్జాతీయ ప్రమాణాలతో పరిశోధన వ్యాసాలు ప్రచురించడంతో పాటు పేటెంట్లు కూడా సాధించాలని ఆకాంక్షించారు. పరిశోధన సహచరులు తమ ప్రధాన పరిశోధకులకు పూర్తి సహకారం అందించి, నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కే-హబ్ త్వరలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని, అక్కడి నుంచి కనీసం పది అంకుర సంస్థలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వినూత్న ఆలోచనలను సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా మలచడమే పరిశోధనల అసలైన ఉద్దేశమని పేర్కొన్నారు. ఒకప్పుడు కాకతీయ విశ్వవిద్యాలయం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు పొందిందని గుర్తు చేసిన ఆయన, ఆ ప్రతిష్ఠను తిరిగి తీసుకురావడానికి అకాడమిక్ అభివృద్ధి, నాణ్యమైన పరిశోధనలు, మౌలిక సదుపాయాల కల్పనకు విశ్వవిద్యాలయం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో పరిశోధన సహచరులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తాను పరిశోధకుడిగా పనిచేసిన అనుభవాలను పంచుకున్న ఉపకులపతి, పరిశోధనలో క్రమశిక్షణ, నిబద్ధత, సమయపాలన ఎంతో ముఖ్యమని తెలిపారు. విశ్వవిద్యాలయ గ్రంథాలయాలను బలోపేతం చేయడానికి రూ. కోటి నిధులతో పుస్తకాల కొనుగోలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే విదేశీ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాల ద్వారా విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు పరస్పర మార్పిడి అవకాశాలు మరింత విస్తరించనున్నాయని చెప్పారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ, ఉన్నత విద్యాభివృద్ధి పథకం ద్వారా పరిశోధన సంస్కృతి బలోపేతం అవుతోందన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా పరిశోధకులకు విలువైన అనుభవం లభించడంతో పాటు ప్రయోగశాలలు కూడా గణనీయంగా అభివృద్ధి చెందాయని వివరించారు. ఉన్నత విద్యాభివృద్ధి పథకం నోడల్ అధికారి ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, పరిశోధన సహచరులు ప్రధాన పరిశోధకులతో సమన్వయంగా పనిచేసి సెప్టెంబర్ నెలాఖరులోగా ప్రాజెక్టు నివేదికలను పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఈ పథకం కింద వెలువడే ప్రతి పరిశోధన వ్యాసంలో సంబంధిత పథకానికి తప్పనిసరిగా గుర్తింపు ఇవ్వాలని పేర్కొన్నారు.

## విద్యార్థుల నిరసనలపై కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఖండించిన ఎంసీపీఐ(యు)

**హైదరాబాద్, 21 జులై 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే విధంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తున్నాయని ఎంసీపీఐ(యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తీవ్రంగా విమర్శించారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశవ్యాప్తంగా ప్రజలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న నిరసన కార్యక్రమాల సందర్భంగా ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను అర్ధరాత్రి అరెస్టు చేసి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంచిన తీరును ఆయన ఖండించారు. శాంతియుతంగా నిర్వహించిన "చలో పార్లమెంట్" కార్యక్రమంపై లాఠీచార్జీ, టియర్ గ్యాస్, రబ్బరు బుల్లెట్లు, నీటి ఫిరంగుల ప్రయోగం జరిపి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యమకారులపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని గాదగోని రవి అన్నారు. ఈ ఘటనల్లో అనేక మంది గాయపడగా, పలువురిపై తప్పుడు కేసులు నమోదు చేసి అక్రమ అరెస్టులు చేశారని ఆరోపించారు. ఈ సంఘటనలకు నిరసనగా హైదరాబాద్‌లో లోక్ భవన్ ఎదుట వామపక్ష విద్యార్థి సంఘాలు నిర్వహించిన




ఆందోళనలో పాల్గొన్న విద్యార్థి నాయకులను కూడా తెలంగాణ ప్రభుత్వం అరెస్టు చేయడం తీవ్రంగా ఖండనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి, రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర నాయకుడు కుమార్‌తో పాటు పలువురు విద్యార్థి నాయకులను బలవంతంగా అరెస్టు చేయడాన్ని ఆయన ప్రశ్నించారు. కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా విద్యా వ్యవస్థను మార్చే ప్రయత్నాల్లో భాగంగానే ప్రశ్నాపత్రాల లీకేజీలు జరుగుతున్నాయని, వాటికి వ్యతిరేకంగా పోరాడుతున్న విద్యార్థులకు మద్దతు ఇవ్వాల్సిన ప్రభుత్వాలు వారిపైనే కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడం సరైన విధానం కాదని గాదగోని రవి అన్నారు. అక్రమంగా అరెస్టు చేసి తప్పుడు కేసులు నమోదు చేసిన విద్యార్థి నాయకులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విడుదల చేయాలని ఎంసీపీఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

# కేయూలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన యువజన కాంగ్రెస్





**కాకతీయ యూనివర్సిటీ, 21 జులై 2026 (జై భీమ్ న్యూస్)**

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్వాల కార్తీక్ ఆధ్వర్యంలో మంగళవారం కాకతీయ విశ్వవిద్యాలయం మొదటి గేటు వద్ద వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి 58వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమక్షంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అల్వాల కార్తీక్ మాట్లాడుతూ, భద్రకాళి అమ్మవారి ఆశీస్సులతో నాయిని రాజేందర్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి వరంగల్ పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆదరణను మరింత పొందుతూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వరంగల్ పశ్చిమను తెలంగాణలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని మనసారా కోరుకుంటూ, ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ తీగల ప్రేమ్‌చంద్, డాక్టర్ ఓ. రాజేందర్, మట్టెడ కుమార్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాంబరాజు రాజకుమార్, ఎం.డి. జాఫర్, భీమ వినయ్ కుమార్, మహ్మద్ ఖుర్షీద్, మార్త వరుణ్ బాబు, శివకుమార్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్యామ్, సౌరం రాహుల్ వర్ధన్, యువజన కాంగ్రెస్ నాయకులు మింటూ, ఇల్లందుల వివేక్, లక్కీ, గాద వివేక్‌తో పాటు కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

## హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ పనులు వేగవంతం చేయాలి: రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి

నిర్మాణ పనుల జాప్యంపై అసంతృప్తి

అలసత్వం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట్ లో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనుల పురోగతిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. నిర్మాణ పనులు ఆశించిన వేగంతో సాగకపోవడంపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎడ్యుకేషన్ హబ్‌లో చేపట్టిన అన్ని ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన నెలవారీ పురోగతి నివేదికలను క్రమం తప్పకుండా తనకు అందజేయాలని సూచించారు. పనుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను అవసరమైతే సస్పెండ్ చేయడానికి వెనుకాడవద్దని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇవ్వాల్సిన నివాస ప్లాట్ల కేటాయింపులో జరుగుతున్న జాప్యంపై కూడా ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులందరికీ వచ్చే వారంలోపు ప్లాట్ల పట్టాలు అందజేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రాజెక్టు సహా ఎడ్యుకేషన్ హబ్‌లోని అన్ని పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు.

## విద్యార్థులపై భారం మోపే ఎఫ్‌ఆర్‌ఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి - పీడీఎస్‌యూ

**కేయూ క్యాంపస్, 21 జులై 2026 (జై భీమ్ న్యూస్)**




కాకతీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల హాజరు నమోదు కోసం అమలు చేస్తున్న ముఖ గుర్తింపు హాజరు విధానం (ఎఫ్ఆర్ఎస్)ను వెంటనే రద్దు చేయాలని పీడీఎస్‌యూ కాకతీయ విశ్వవిద్యాలయ కార్యవర్గం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ పరిపాలన భవనం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల హాజరు కోసం తీసుకొచ్చిన ఎఫ్ఆర్ఎస్ విధానం విద్యార్థులకు అనేక ఇబ్బందులు కలిగిస్తోందని అన్నారు. స్మార్ట్‌ఫోన్ లేని విద్యార్థులకు ఇది అదనపు ఆర్థిక భారంగా మారుతుందని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో ప్రయోగశాలలు, కంప్యూటర్లు, గ్రంథాలయ సదుపాయాలు, నాణ్యమైన భోజనం వంటి మౌలిక వసతులు సరిపడా లేకపోయినా వాటి అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా, విద్యార్థులకు ఉపయోగం లేని ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని ప్రవేశపెట్టడం సమంజసం కాదని విమర్శించారు. విశ్వవిద్యాలయ నిధులను విద్యార్థుల సంక్షేమానికి వినియోగించాల్సిందిపోయి, ఒక ప్రైవేటు సమాచార సాంకేతిక సంస్థకు ప్రయోజనం చేకూరేలా వ్యవహరిస్తున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. నిజంగా విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ప్రయోగశాలలు, కంప్యూటర్లు, గ్రంథాలయాలు, నాణ్యమైన భోజనం వంటి సౌకర్యాలను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయ అనుబంధ ప్రైవేటు కళాశాలల్లో కనీస నిబంధనల అమలుపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని, అలాంటి సమస్యలను విస్మరించి పేద విద్యార్థులపై ఎఫ్ఆర్ఎస్ రూపంలో అదనపు భారం మోపడం తగదని అన్నారు. తక్షణమే ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని, లేకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివ, దీక్షిత్ రెడ్డి, ముషారఫ్, విశాల్, పృథ్వి, మమత, సంధ్య, రాధిక, అనిత తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయ పరిశోధకుడు నిమ్మనగోటి రాములుకు డాక్టరేట్

**కేయూ క్యాంపస్, 21 జులై 2026 (జై భీమ్ న్యూస్)**



కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగానికి చెందిన పరిశోధకుడు నిమ్మనగోటి రాములుకు డాక్టరేట్‌ను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ప్రకటించారు. నిమ్మనగోటి రాములు "తెలంగాణ రాష్ట్రంలో మహిళలు, పిల్లల కోసం ఆహార భద్రత కార్యక్రమాలు -- ఒక అధ్యయనం" అనే అంశంపై అర్థశాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ ఎం. పుష్పలత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. నల్గొండ జిల్లా కట్టంగూర్ మండలం పరడా గ్రామానికి చెందిన నిమ్మనగోటి రాములు డాక్టరేట్ సాధించడం పట్ల విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

## బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ





**హైదరాబాద్, 21 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్‌లోని ప్రసిద్ధ బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి దేవాలయంలో నిర్వహించిన వార్షిక కళ్యాణ మహోత్సవంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన కుమార్తె సుస్మిత పటేల్‌తో కలిసి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మంత్రి కొండా సురేఖకు దేవాలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదమంత్రాల నడుమ అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. తదనంతరం మంత్రి కొండా సురేఖ తన కుమార్తెతో కలిసి ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణోత్సవానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీమణి గీతా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి వార్షిక కళ్యాణోత్సవంలో పాల్గొనడం ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. తన కుమార్తెతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కళ్యాణోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారని, ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు, శివసత్తులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయడం ద్వారా భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించినట్లు పేర్కొన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వరుణ యాగాలు, ప్రత్యేక పూజలు దైవానుగ్రహానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని మంత్రి అన్నారు. అమ్మవారి కటాక్షంతో తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ వర్షాలతో రాష్ట్రం పాడిపంటలతో సస్యశ్యామలంగా మారి రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ప్రార్థించినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. అలాగే బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయ వైభవాన్ని మరింత అభివృద్ధి చేయడానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్**

**హన్మకొండ, 21 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

రహదారులపై ప్రమాదాలను నివారించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి అదనపు కార్యదర్శి డాక్టర్ ఇలంబర్తి, శాంతిభద్రతలు, రవాణా, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖ అధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు, రవాణా, రహదారులు-భవనాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ జాతీయ రహదారులతో పాటు ప్రధాన రహదారులపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలను ప్రతి నెలా నిర్వహించాలన్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి, తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించి సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి భద్రతా నిబంధనలపై వాహనదారులకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతతో పాటు హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ఆయా జిల్లాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వరంగల్ రీజియన్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, ఎన్‌హెచ్ ఈఈ కిరణ్ కుమార్, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఆర్అండ్‌బీ ఈఈ దేవిక చౌహాన్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేష్ రెడ్డి, డీటీఓ జనార్దన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ చేరాలు తదితర అధికారులు పాల్గొన్నారు.




# హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు







**హనుమకొండ 21 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్షా సమావేశానికి హాజరైన రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తల సమక్షంలో జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కేక్ కట్ చేయించి జన్మదిన వేడుకలను ప్రారంభించారు. అనంతరం శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ప్రజానాయకుడని కొనియాడారు. ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి విశేష సేవలు అందించాలని ఆకాంక్షించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అక్కడున్న ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన ప్రజాసేవా ప్రస్థానం మరింత విజయవంతం కావాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణరావు, డాక్టర్ రామచంద్ర నాయక్, డాక్టర్ మురళి నాయక్, కేఆర్ నాగరాజు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు, కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకలు ఆత్మీయ వాతావరణంలో ఘనంగా సాగాయి.

## ఎల్‌నీనో కంటింజెన్సీ ప్లాన్ బుక్‌లెట్ ఆవిష్కరణ

**రైతులకు సబ్సిడీ విత్తనాల పంపిణీ**



**హన్మకొండ, 21 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

వానాకాల పంటల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ రూపొందించిన 'ఎల్‌నీనో కంటింజెన్సీ ప్లాన్--2026' బుక్‌లెట్‌తో పాటు పంటల క్యాలెండర్లను రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా ఆవిష్కరించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించేందుకు సబ్సిడీపై అందుబాటులోకి తీసుకువచ్చిన కంది, పెసర విత్తనాల ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. హసన్‌పర్తి, ఎల్కతుర్తి, దామెర, భీమదేవరపల్లి మండలాలకు చెందిన రైతులకు మంత్రుల చేతుల మీదుగా వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలను అందజేశారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అందుకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవాలని మంత్రులు రైతులకు సూచించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

## నెక్కొండ ఎస్ఐ మహేందర్‌పై సస్పెన్షన్ వేటు

**అవినీతి ఆరోపణలపై శాఖాపరమైన విచారణలో ప్రాథమిక ఆధారాలు**

**నెక్కొండలో స్వీట్లు పంచి, బాణాసంచా కాల్చి పలువురి సంబరాలు**



**నెక్కొండ, 21 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

నెక్కొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేందర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఎస్ఐ మహేందర్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి శాఖాపరంగా విచారణ చేపట్టగా, ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ చర్య తీసుకున్నట్లు తెలిసింది. ఎస్ఐ సస్పెన్షన్ విషయం తెలియడంతో నెక్కొండలో పలువురు ప్రజలు స్వీట్లు పంచుకొని, బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. అంతేకాకుండా పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ఘటన నెక్కొండలో చర్చనీయాంశంగా మారింది. అవినీతి ఆరోపణలపై పోలీస్ శాఖ తీసుకున్న చర్యను పలువురు స్వాగతించినట్లు సమాచారం.

# రాజన్నకు ఇచ్చిన విరాళంలో తిరకాసు

**వృద్ధ దంపతుల రూ.7 లక్షల1116ల విరాళం**

**అభ్యంతరం వ్యక్తం చేసిన కూతుళ్లు**

**వెనక్కి ఇచ్చేయాలని అధికారులకు మొర**

**వేములవాడ,జూలై 21(జై భీమ్ న్యూస్):**

వేములవాడ రాజన్న ఆలయానికి అందజేసిన విరాళం విషయంలో గందరగోళం నెలకొంది. ఇచ్చిన విరాళం వెనక్కి ఇవ్వాలని ఓ వృద్ధ దంపతుల కూతుళ్లు ఆలయ అధికారులకు మొర పెట్టుకున్నారు. ఈ మేరకు డబ్బులు వెనక్కి ఇవ్వాలని కుటుంబ సభ్యులు ఆలయ అధికారులను కలిసి విన్నవించిన వ్యవహారం మంగళవారం చోటుచేసుకుంది. వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ చెందిన పసుల లక్ష్మీనారాయణ-జనాభాయ్ వృద్ధ దంపతులకు ఏడుగురు కూతుర్లు ఉన్నారు. అయితే సోమవారం భీమేశ్వర స్వామి దర్శించుకునేందుకు వచ్చిన ఈ దంపతులు స్వామివారి నిత్య అన్నదాన సత్రానికి రూ. 7 లక్షల1116లను సోమవారం రాజన్న ఆలయ నిత్యాన్నదాన సత్రానికి విరాళంగా అందజేశారు. అయితే విరాళం అందజేసిన విషయం తెలుసుకున్న కూతుర్లు మంగళవారం కార్యాలయం చేరుకొని అభ్యంతరం వ్యక్తం చేశారు. తల్లి జనాభాయితో కలిసి కూతుర్లు ఆయన మతిస్థిమితం బాగా లేదని ఇంట్లో రూ.లక్ష మాత్రమే విరాళం అందజేస్తామని చెప్పి తీరా ఆలయానికి వచ్చాక రూ. 7 లక్షలు ఇచ్చారని పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితి కూడా బాగా లేనందున ఆసుపత్రి ఖర్చులకు కూడా ఇంట్లో నయా పైసా లేదని అధికారులతో వాపోయారు. వృద్ధ దంపతులకోసం కనీసం మానవ కోణంలోనైనా విరాళంగా అందజేసిన డబ్బును తిరిగి ఇస్తే ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందిస్తామని కోరారు. ఇకముందు కూడా నగదు, బంగారంతో వస్తే దయచేసి మాకు సమాచారం అందించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఆయననుండి ఎలాంటి విరాళాలు స్వీకరించవద్దని కూడా అధికారులను కోరారు. అయితే స్వామివారికి సమర్పించిన నగదు వెనక్కి ఇవ్వబడదని దానికి నిబంధనలు ఉంటాయని అధికారులు వారికి వివరించారు. వృద్ధ దంపతుల ఆరోగ్య అవసరాల కోసమైన నగదు ఇవ్వాలని వారు దరఖాస్తు చేసుకున్నారు.

# వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ

**ఎల్‌నీనో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**వరికి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను సన్నద్ధం చేయాలి: మంత్రి పొన్నం ప్రభాకర్**

**దేవాదుల మోటార్ల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం**

**తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలకు ఆదేశం**

**హన్మకొండ, 21 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

ఎల్‌నీనో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ వర్షాభావ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల పర్యవేక్షణ కోసం ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించామని, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీరు, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై సమగ్ర నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలని సూచించారు. అవసరమైన సహాయం కోసం కేంద్ర ప్రభుత్వానికి కూడా నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకునేలా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని భరోసా ఇచ్చారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా తాగునీరు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. మోటార్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు సాంకేతిక లోపాలు తలెత్తితే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల మధ్య సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

**ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి: పొన్నం**

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఎల్‌నీనో ప్రభావంతో జూలై 27 వరకు వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందన్నారు. వరికి బదులుగా తక్కువ నీటితో అధిక దిగుబడి, ఆదాయం అందించే మెట్ట, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా లెమన్‌గ్రాస్ వంటి వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. పశుసంవర్ధక రంగంపై కూడా ప్రత్యేక దృష్టి సారించి పశువులకు తాగునీరు, పశు గ్రాసం కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాల వారీగా నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి అవసరాలకు అందుబాటులో ఉన్న నీటిపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లోని తాగునీరు, సాగునీరు, వ్యవసాయ సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ ప్రత్యామ్నాయ పంటలపై రైతులతో ప్రతి పది రోజులకు సమావేశాలు నిర్వహించాలని, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని, మున్సిపాలిటీల్లో అమృత్ పనులను వేగవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య దేవాదుల ప్రాజెక్టు ఉమ్మడి వరంగల్ జిల్లాకు వరమని, మోటార్ల ద్వారా నీటి పంపింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య వరంగల్ నగరంలో దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గ్రేటర్ వరంగల్ పరిధిలోని 63వ డివిజన్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీల కారణంగా తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి పొంగులేటి లీకేజీలను తక్షణమే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు తాగునీరు, సాగునీటికి దేవాదుల ప్రధాన ఆధారమని, మూడు దశల్లోని పది మోటార్లను కనీసం 100 రోజులపాటు నిరంతరాయంగా నడిపేందుకు విద్యుత్, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా, మండలాల వారీగా కార్యాచరణ రూపొందించి నేలల స్వభావానికి అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించాలని, అవసరమైతే ఆరుతడి పంటల విత్తనాలను సబ్సిడీపై అందించాలని కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు హసన్‌పర్తి మండలం, విలీన గ్రామాల్లోని తాగునీటి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. వర్ధన్నపేట పట్టణంలో అమృత్ పథకం పనులను వేగవంతం చేయాలని సూచించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే వాణిజ్య పంటలను ప్రోత్సహించాలని, దేవాదుల సహా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించాలని కోరారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ మహబూబాబాద్ పట్టణం, మెడికల్ కళాశాలలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, లెమన్‌గ్రాస్ సాగు, డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని కోరారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ, పంచాయతీరాజ్, ఉద్యాన, రెవెన్యూ శాఖల సమన్వయంతో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను అనుసంధానించి 2,400 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. 62 మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పారదర్శకంగా ఎరువులు అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, దొంతి మాధవ రెడ్డి, కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, ప్రత్యేక అధికారి దేవసేన, ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భద్రకాళి ఆలయంలో వైభవంగా శాకంభరీ నవరాత్రి ఉత్సవాలు






**ఉగ్రా నిత్యా, శివదూతీమాతగా అమ్మవారి అలంకరణ**

**వరంగల్, 21 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ మహానగరంలోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్రి మహోత్సవాలు ఏడో రోజు మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగాయి. తెల్లవారుజామున 4 గంటలకు నిత్యాహ్నిక కార్యక్రమాల అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తులను కాళీ క్రమం ప్రకారం ఇచ్ఛాశక్తి స్వరూపిణి ఉగ్రా నిత్యాగా, షోడశీ క్రమం ప్రకారం జ్ఞానశక్తి స్వరూపిణి శివదూతీమాతగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం సందర్భంగా భక్తులందరికీ శుభం కలగాలని అర్చకులు ముందుగా సుబ్రహ్మణ్య ఆరాధన చేపట్టారు. దశమహావిద్యల్లోని కాళీ క్రమం ప్రకారం ఏడో రోజుకు అధిదేవత ఉగ్రామాత అని, ఆమెను ఉగ్రతార అని కూడా పిలుస్తారని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. ఉగ్రామాతను ఉపాసించడం వల్ల ఐశ్వర్యం, శత్రువులపై విజయం కలుగుతాయని పేర్కొన్నారు. శివదూతీమాతను సేవించడం వల్ల అపరిష్కృతంగా ఉన్న వ్యవహారాలు పరిష్కారమవుతాయని వివరించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సమేతంగా తెల్లవారుజామున ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ఎమ్మెల్యే దంపతులకు వేదాశీర్వచనం అందించి అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జటోత్ రామచందర్ నాయక్ ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రాలను అందజేశారు. ఏడో రోజు ఉత్సవాల సందర్భంగా సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా భక్తులకు దధ్యోదనం, ప్రత్యేకంగా తయారుచేసిన హల్వాను ప్రసాదంగా పంపిణీ చేశారు.



# పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం.

**జూలై 25న ఇంటర్వ్యూలు**

**హనుమకొండ, 21 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**



పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (స్వయంప్రతిపత్తి), వడ్డేపల్లిలో 2026--27 విద్యా సంవత్సరానికి వివిధ విభాగాల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి జూలై 25, శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో బయోటెక్నాలజీ, స్టాటిస్టిక్స్, అనువర్తిత పోషకాహారం, బీసీఏ, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, డేటా సైన్స్, గణితశాస్త్రం, బీబీఏ రిటైల్, ఆరోగ్య సంరక్షణ విభాగాల్లో మొత్తం పలు ఖాళీలను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తు వివరాలతో పాటు సంబంధిత ధ్రువపత్రాల ప్రతులను జూలై 24 సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో సమర్పించాలని సూచించారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు జూలై 25 ఉదయం 11 గంటలకు తప్పనిసరిగా అసలు ధ్రువపత్రాలతో హాజరుకావాలని తెలిపారు. సంబంధిత స్నాతకోత్తర కోర్సులో సాధారణ అభ్యర్థులకు కనీసం 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ, జాతీయ అర్హత పరీక్ష లేదా రాష్ట్ర అర్హత పరీక్ష ఉత్తీర్ణత ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. సేవా అనుభవం, విద్యార్హతలను కూడా ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. అర్హులైన అభ్యర్థులు లభించని పక్షంలో స్నాతకోత్తర మార్కుల ఆధారంగా ఎంపిక చేపడతామని తెలిపారు.

**రెండు కొత్త కోర్సులు ప్రారంభం**

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కళాశాలలో రెండు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. బీకాంలో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా కోర్సుతో పాటు బీఎస్సీలో ఆరోగ్య సంరక్షణ కోర్సును శిక్షణ అనుసంధానిత డిగ్రీ కార్యక్రమం కింద ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు ఆధునిక నైపుణ్యాలు, సమాచార మార్పిడి సామర్థ్యాలు, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన శిక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన పరిజ్ఞానం అందించనున్నట్లు చెప్పారు. కోర్సు పూర్తయ్యే నాటికే విద్యార్థులు ఉద్యోగాల్లో చేరే విధంగా శిక్షణా విధానాన్ని రూపొందించినట్లు వివరించారు. కొత్త కోర్సులకు నైపుణ్యం కలిగిన అధ్యాపకులను అందుబాటులో ఉంచేందుకు అతిథి అధ్యాపకుల నియామకం చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు వెబ్ ఎంపికల్లో పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ కోరారు. కళాశాలలో విశాలమైన ప్రయోగశాలలు, వసతి గృహం, జాతీయ సేవా పథకం, జాతీయ విద్యార్థి దళం, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం, ఇరవై నాలుగు గంటల భద్రత, నిఘా కెమెరాల పర్యవేక్షణ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ చంద్రమౌళి విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

**రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్**



**హన్మకొండ, 21 జూలై 2026(జై భీమ్ న్యూస్)**

రహదారులపై ప్రమాదాలను నివారించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి అదనపు కార్యదర్శి డాక్టర్ ఇలంబర్తి, శాంతిభద్రతలు, రవాణా, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖ అధికారులతో కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు, రవాణా, రహదారులు-భవనాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ జాతీయ రహదారులతో పాటు ప్రధాన రహదారులపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశాలను ప్రతి నెలా నిర్వహించాలన్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసి, తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించి సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారి భద్రతా నిబంధనలపై వాహనదారులకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతతో పాటు హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ఆయా జిల్లాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా వరంగల్ రీజియన్ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, ఎన్‌హెచ్ ఈఈ కిరణ్ కుమార్, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ దేవిక చౌహాన్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేష్ రెడ్డి, డీటీఓ జనార్దన్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ చేరాలు తదితర అధికారులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem సామాన్యుడి ఆయుధంగా

# వరంగల్ నగరం నడిబొడ్డున నరకయాతన..!

**నందయ్యగారి కాంపౌండ్‌లో రోడ్లు, డ్రైనేజీ సమస్యలతో ప్రజల అవస్థలు**
**అత్యవసర వాహనాలకు దారి కష్టమే.. పన్నులు కడుతున్నా అభివృద్ధి లేదంటూ ఆవేదన**


**వరంగల్, 21 జూలై 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ నగరం నడిబొడ్డున ఉన్న జేపీఎన్ రోడ్డులోని నందయ్యగారి కాంపౌండ్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులు గుంతలమయంగా మారడం, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, కాలనీ ప్రధాన ప్రవేశ మార్గం ఇరుకుగా ఉండటంతో నిత్యం నరకయాతన అనుభవిస్తున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వల్ప వర్షం కురిసినా కాలనీలోని రహదారులు బురదమయంగా మారుతున్నాయని, డ్రైనేజీ సౌకర్యం సరిగా లేక మురుగునీరు రోడ్లపై నిలిచిపోతోందని స్థానికులు తెలిపారు. నిల్వ నీటితో దుర్వాసనతో పాటు దోమల బెడద పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాలనీ ప్రధాన ప్రవేశ మార్గం ఇరుకుగా ఉండటం మరో ప్రధాన సమస్యగా మారిందని స్థానికులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు సులభంగా లోపలికి వచ్చే పరిస్థితి లేదని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రవేశ మార్గంలో ఉన్న అడ్డంకులను పరిశీలించి, అత్యవసర వాహనాలు సులభంగా రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు. ప్రతి సంవత్సరం ప్రాపర్టీ ట్యాక్స్‌తో పాటు ఇతర మున్సిపల్ పన్నులను క్రమం తప్పకుండా చెల్లిస్తున్నప్పటికీ తమ కాలనీ అభివృద్ధిని అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సమస్యలపై పలుమార్లు



సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా శాశ్వత పరిష్కారం లభించలేదని వాపోతున్నారు. ఇదిలా ఉండగా, కాలనీ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఉన్న ఓ భవనం వినియోగంపై కూడా సమగ్ర విచారణ జరపాలని కాలనీవాసులు కోరుతున్నారు. సదరు భవనం వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, అధికారిక రికార్డుల్లో దాని వినియోగ కేటగిరీ ఏమిటి, వాస్తవ వినియోగానికి అనుగుణంగా మున్సిపల్ అనుమతులు, పన్నుల వర్గీకరణ తదితర నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాలను సంబంధిత అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే కాలనీ ప్రవేశ మార్గం ఇరుకుగా మారడానికి కారణమైన నిర్మాణాలు, అడ్డంకులపై సాంకేతిక పరిశీలన జరిపి, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నందయ్య కాంపౌండ్‌లో వెంటనే సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వీధి దీపాలు, పారిశుధ్యం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని, అత్యవసర వాహనాలు సులభంగా వెళ్లేలా ప్రవేశ మార్గాన్ని





అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు. మేము పన్నులు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నాం. అయినా కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి అని నందయ్యగారి కాంపౌండ్ వాసులు విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, కాలనీలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## జమ్మూ కాశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్

**కొండ చరియలు విరిగి పడి పలువురు గల్లంతు**
**వరదలతో ఇప్పటికే పలువురు మృతి**



**శ్రీనగర్,జూలై21(జై భీమ్ న్యూస్):**

జమ్మూకశ్మీర్‌లో మేఘ విస్ఫోటం కారణంగా సంభవించిన ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా సరిహద్దు జిల్లాలైన పూంఛ్, రాజౌరీల్లో ఇప్పటికే 12 మంది మృతి చెందగా.. పలువురు గల్లంతయ్యారు. రోడ్లు, ఇళ్లుసహా పలు ప్రభుత్వ, ప్రైవేటు మౌలిక సదుపాయాలు చాలావరకు దెబ్బతిన్నాయి. దీంతో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోమవారం దిల్లీలో రాష్ట్ర హోదా కోసం తలపెట్టిన ఆందోళనను విరమించుకుని జమ్మూకు హుటాహుటిన బయల్దేరి వెళ్లారు. పూంఛ్ జిల్లాలోని సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో ఎక్కువ విధ్వంసం జరిగింది. ఇక్కడే అధికంగా 10 మరణాలు సంభవించాయి. 9 మృతదేహాలు లభ్యమైనప్పటికీ.. కనీసం 16 మృతి చెంది ఉండే అవకాశం ఉందని పూంఛ్ డిప్యూటీ కమిషనర్ అశోక్ కుమార్ శర్మ తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లోని రియాస్ జిల్లాలో వర్షాలవల్ల మాతా వైష్ణోదేవి యాత్రను తాత్కాలికంగా నిలిపేశారు. సురన్‌కోట్ తెహసీల్ ప్రాంతంలో సంభవించిన మేఘ విస్ఫోటం మహమ్మద్ లతీఫ్ అనే ఒక వ్యక్తి జీవితంలో ఊహించనంత విషాదాన్ని నింపింది. భారీ వర్షం కారణంగా ఆయన తన వాహనాన్ని సురక్షిత ప్రాంతంలో పార్క్ చేయడానికి బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి.. ఆయనకు చెందిన మూడంతస్తుల భవనం మట్టి, బురదలో కూరుకుపోయింది. దీంతో అందులోని 8 మంది కుటుంబసభ్యులు మరణించారు. లతీఫ్‌తో పాటు అతని పెద్ద కుమారుడు మాత్రమే బతికి బట్టకట్టారు. ప్రమాదం సమయంలో లతీఫ్ కుమారుడు జమ్మూలో ఉన్నారు.

## సిక్కింలో ఘోర విషాదం

**నిర్మాణంలో ఉన్న సొరంగంపై విరిగిపడ్డ కొండచరియలు**
**పదిమంది కార్మికుల దుర్మరణం**

**గ్యాంగ్‌టక్,జూలై21(జై భీమ్ న్యూస్):**

సిక్కింలో ఘోర విషాదం చోటుచేసుకుంది. దక్షిణ సిక్కింలోని సమర్‌దుంగ్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న సొరంగం వద్ద కొండచరియలు విరిగిపడటంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటివరకు పదిమంది మృతిచెందారు. వారి మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు. మరో 20 మందికిపైగా కార్మికులు శిథిలాల కింద చిక్కుకుని ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను నామ్చి జిల్లా కలెక్టర్ అనుప తమ్లింగ్ వెల్లడించారు. సోమవారం తీస్తా స్టేజ్-జలవిద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించిన సొరంగంలో ఈ ప్రమాదం జరిగింది. పటేల్ ఇంజినీరింగ్ సంస్థ నిర్మాణ పనులు నిర్వహిస్తుండగా, సొరంగం లోపల అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడి మార్గం పూర్తిగా మూసుకుపోయింది. అదే సమయంలో మీథేన్ గ్యాస్ లీక్ కావడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ఘటన అనంతరం జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, సిక్కిం పోలీసులు, అగ్నిమాపక, అత్యవసర సేవల బృందాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. అయితే సొరంగంలో మీథేన్ గ్యాస్ స్థాయిలు అధికంగా ఉండటంతో రక్షణ సిబ్బంది లోపలికి వెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదనంగా ఎన్‌హెచ్‌పీసీకి చెందిన ఆరుగురు సిబ్బంది కూడా లోపలే ఉన్నట్లు సమాచారం. సొరంగంలోకి ప్రవేశించిన తొలి సహాయక బృంద సభ్యులు మీథేన్ ప్రభావంతో శ్వాస తీసుకోవడంలో పలు సమస్యలను ఎదుర్కొన్నారు. వారిని వెంటనే బయటకు తీసుకువచ్చి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

## కిసాన్ ఘాట్ వద్ద నిరసనకు వేలాదిగా రైతుల రాక

**పోలీసుల కట్టుదిట్టమైన భద్రతా చర్యలు**
**హర్యానా-పంజాబ్ శంభు సరిహద్దు వద్ద ఉద్రిక్తత**

**న్యూఢిల్లీ,జూలై21(జై భీమ్ న్యూస్):**

హర్యానా-పంజాబ్ సరిహద్దులోని శంభు బార్డర్ వద్ద హైటెన్షన్ నెలకొంది. మహాపంచాయత్‌లో పాల్గొనేందుకు పంజాబ్, హర్యానా నుంచి ఢిల్లీ వైపుగా వేలాది మంది రైతులు బయలుదేరారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద నిరసన తెలిపేందుకు అన్నదాతలు వస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా తక్కువ ధరకు, సబ్సిడీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు నిరసనకు దిగుతున్నారు. అయితే, వారిని అడ్డుకునేందుకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఢిల్లీలోని కిసాన్ ఘాట్ వద్ద మహాపంచాయత్‌కు 'దేశ్ బచావో మోర్చా' పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా సుమారు 550 రైతు సంఘాలు, సామాజిక సంస్థలు ఇందులో పాల్గొననున్నాయి. అయితే, నేడు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ఢిల్లీకి బయలుదేరుతున్నట్లు ప్రకటించింది. దీంతో శంభు సరిహద్దును పోలీసులు మూసివేశారు. రైతులను అడ్డుకునేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ అన్నదాతలను నిలువరించేందుకు చర్యలు చేపట్టారు. బారికేడ్లు, ఇనుప కంచెలను ఏర్పాటు చేశారు. సందర్భంగా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ పంజాబ్ నాయకుడు జర్మన్‌జిత్ సింగ్ బండాలా మాట్లాడారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం భారతీయ రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, విస్తృత ప్రజానీకంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. భారతదేశంలోని చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను విస్మరిస్తూ అమెరికన్ కంపెనీలు, రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ఈ ఒప్పందం లక్ష్యమని బండాలా ఆరోపించారు. నేడు పంజాబ్ రైతులతో పాటు హర్యానా, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల నుంచి నిరసనలో పాల్గొనేందుకు అన్నదాతలు వస్తున్నారని తెలిపారు. ఒకవేళ తాము ఢిల్లీకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకుంటే అక్కడే శాంతియుత సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నిరసన ఆరంభం మాత్రమేనని, ఒప్పందాన్ని కేంద్రం రద్దు చేయకపోయినా, తమ డిమాండ్లను పరిష్కరించకపోయినా ఆందోళనను తీవ్రతరం చేస్తామని బండాలా హెచ్చరించారు.

## ములుగు జిల్లాలో విస్తారంగా వర్షాలు

**జోరు వానలకు తెగిపోయిన రోడ్డు**



**ములుగు,జూలై21(జై భీమ్ న్యూస్):**

ములుగు జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల వృక్షాలు నేలకూలాయి. వాజేడు మండలంలోని జాతీయ రహదారి 163 పై ఇసుక వాగు బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు వర్షానికి తెగిపోవడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడంతో పలుచోట్ల వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో సగటున 7.66 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాజేడు, వెంకటాపురం మండలాల్లో గరిష్ఠంగా 11 సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదైంది. ఆయా చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురవడంతో చెరువులు, కుంటలు, వాగులు నిండుకుండను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని పర్యవేక్షిస్తూ చర్యలు చేపడుతున్నారు.

## సూపర్ స్టార్ అమితాబ్‌కు ఆరోగ్య సమస్య

ముంబై,జూలై21(జై భీమ్ న్యూస్): అగ్రకథానాయకుడు అమితాబ్ బచ్చన్ తన ఆరోగ్యంపై పెట్టిన తాజా పోస్ట్ ఆయన అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. 83 ఏళ్ల అమితాబ్ తాను ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. ఐసీయూలో ఉండాల్సి వచ్చిందని వెల్లడించారు. అయితే, ఈ సర్జరీ ఎప్పుడు.. ఎందుకు జరిగిందనే విషయాలను మాత్రం ఆయన స్పష్టం చేయలేదు. హాస్పిటల్ వాతావరణం, వైద్యుల పర్యవేక్షణ గురించి పోస్ట్ పెట్టారు. శస్త్రచికిత్స.. ఐసీయూలో నిపుణులైన వైద్యులు.. వైద్య సిబ్బంది సంరక్షణ.. ఆ తర్వాత డిశ్చార్జ్.. ఇంటికి చేరుకోవడం.. అనే క్యాప్షన్ ఇచ్చారు. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత కోలుకునే ప్రక్రియ అత్యంత కష్టమైనదని బిగ్‌బీ పేర్కొన్నారు. ఇంటికి చేరుకున్న తర్వాత ఎదురయ్యే సవాళ్లే అత్యంత కష్టమైనవి. శారీరకంగా, మానసికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాలి. మీరు ఒక గొప్ప విజేతగా నిలిచినా, ఏదో ఒకరోజు ఓటమి మిమ్మల్ని పలకరిస్తుంది. ఇది జీవితంలోనే అత్యంత కష్టమైన సమయం. కొందరు ధైర్యంగా దాన్ని ఎదుర్కొంటారు.. కొందరు లొంగిపోతారు. అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని తన బ్లాగ్‌లో రాసుకొచ్చారు. దీంతో ఆయన త్వరగా కోలుకోవాలంటూ అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు. ప్రస్తుతం అమితాబ్ 'కల్కి' సీక్వెల్‌తో పాటు మరికొన్ని సినిమాల్లో నటిస్తున్నారు.

## తమ్మినేని సీతారాంనకు చుక్కెదురు

**క్వాష్ పిటిషన్ తిరస్కరించన ఎపి హైకోర్టు**

**అమరావతి,జులై 21(జై భీమ్ న్యూస్):**

మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ తమ్మినేని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కేసు దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని పేర్కొన్న న్యాయస్థానం.. ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదని స్పష్టం చేసింది. అరెస్టు భయం ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించింది. ఈ కేసుకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జులై 29కి వాయిదా వేసింది. నకిలీ పత్రాలను ఉపయోగించి సుమారు రూ.4 కోట్ల విలువైన భూమిని తన కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలతో తమ్మినేనిపై కేసు నమోదైంది. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో కేసును రద్దు చేయాలని కోరుతూ తమ్మినేని హైకోర్టును ఆశ్రయించారు. అయితే కేసు ప్రాథమిక దశలో ఉన్నందున క్వాష్ చేయడానికి నిరాకరించిన హైకోర్టు.. చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించింది.

## సింగరేణి మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష

**యాజమాన్యానికి ఎఐటియూసి నేతల వినతి పత్రాలు**

**కొత్తగూడెం,జులై 21(జై భీమ్ న్యూస్):**

ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డు ఫలితాలపై పునఃసమీక్ష చేపట్టి బాధిత కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపు మేరకు మంగళవారం సింగరేణి వ్యాప్తంగా అన్ని మైన్స్, విభాగాల్లో వినతిపత్రాలు సమర్పించారు. పిలుపులో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా సుమారు 2 వేల మంది కార్మికులు ఏళ్ల తరబడి మెడికల్ బోర్డు కోసం ఎదురు చూస్తుండగా, కేవలం 120 మందికి మాత్రమే బోర్డు నిర్వహించడం అన్యాయమని పేర్కొన్నారు. వారిలో 28 మంది కార్మికులకు మెడికల్ బోర్డుకు హాజరుకావాల్సిన సమాచారం కూడా సకాలంలో అందకపోవడం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. హాజరైన 120 మంది కార్మికుల్లో కేవలం 24 మందిని మాత్రమే ఇన్వాలిడేషన్‌కు అర్హులుగా ప్రకటించడం గతంలో నిర్వహించిన మెడికల్ బోర్డులతో పోలిస్తే అత్యంత తక్కువ శాతమని తెలిపారు. బొగ్గు గనుల్లో ముఖ్యంగా అండర్‌గ్రౌండ్‌లో దశాబ్దాలుగా పని చేస్తున్న కార్మికులు కీళ్ల నొప్పులు, వెన్నెముక సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు తదితర తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పటికీ, వాటిని సమగ్రంగా పరిగణనలోకి తీసుకోకుండా ఫలితాలు ప్రకటించడం వల్ల నిజంగా అనారోగ్యంతో ఉన్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో దరఖాస్తు చేసుకుని ఇప్పటికీ మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్న కార్మికులందరికీ తక్షణమే మరోసారి కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహించాలని, ప్రతి కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని నిష్పాక్షికంగా పరిశీలించి అర్హులైన వారిని ఇన్వాలిడేషన్ చేసి, వారి వారసులకు ఉద్యోగాలు కల్పించి కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని యాజమాన్యాన్ని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి గట్టయ్య, ఉపాధ్యక్షుడు కత్తర్ల రాములు, తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులు కాఫీ తాగొచ్చా?

గర్భధారణ సమయంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కాబోయే తల్లులలో తరచుగా తలెత్తే ప్రశ్న ఏమిటంటే కాఫీ తాగడం మంచిదేనా అని. ముఖ్యంగా కెఫీన్ కంటెంట్ కారణంగా వారి శిశువు మెదడు అభివృద్ధికి సురక్షితమేనా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతుంటాయి. కెఫీన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల పిండంపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? కాఫీ అనేది కెఫిన్ ప్రసిద్ధ మూలం. ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. మితమైన మొత్తంలో కెఫిన్ చాలా మందికి సురక్షితంగా పరిగణిస్తుంటారు. గర్భధారణ సమయంలో తల్లి ఏది తిన్నా అది కడుపులో పెరుగుతున్న బిడ్డపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని చెబుతున్నారు వైద్యులు. గర్భిణీ స్త్రీలు కెఫిన్ చాలా నెమ్మదిగా జీర్ణం కావడమే దీనికి కారణం. రక్తప్రవాహంలో ఎక్కువసేపు ఉంటుంది. కెఫీన్‌ను సమర్థవంతంగా విచ్ఛిన్నం చేయడానికి అవసరమైన ఎంజైమ్‌లు పిండంలో లేనందున బిడ్డపై ప్రభావం చూపుతుందంటున్నారు. కెఫీన్ వినియోగం పిండం మెదడు అభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తుంది? గర్భధారణ సమయంలో అధిక కెఫిన్ శిశువు మెదడు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తుంది. ఇది భవిష్యత్ పలు సమస్యలకు దారి తీసేలా ఉంటుంది. న్యూరోఫార్మకాలజీలో ప్రచురించిన పరిశోధన ప్రకారం.. చాలా కెఫిన్ మెదడు సర్క్యూట్లకు అంతరాయం కలిగిస్తుందని సూచిస్తుంది. కొన్ని అధ్యయనాలు గర్భంలో అధిక స్థాయిలో కెఫిన్‌కు గురయ్యే శిశువులకు అటెన్షన్ డిజార్డర్స్, హైపర్యాక్టివిటీ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని సూచిస్తున్నాయి. అయినప్పటికీ, ఈ ప్రమాదాలు ప్రధానంగా అధిక కెఫిన్ వినియోగంతో ముడిపడి ఉన్నాయని డాక్టర్ విష్ణోయ్ చెబుతున్నారు.




## ఉప్పు తినడం పూర్తిగా మానేశారా?

ఒక హెల్తీ అడల్ట్ రోజుకు 4 గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు తినకూడదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక తెలిపింది. అలాగని ఉప్పు పూర్తిగా మానేయకూడదు అంటున్నారు నిపుణులు. అయితే 30 రోజులు సాల్ట్ తినడం మానేస్తే ఏమవుతుందో ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. బరువు తగ్గుతారు : ఉప్పు తినడం ఆపేస్తే బరువు తగ్గుతారు అంటున్నారు నిపుణులు. ఒక నెల పాటు సాల్ట్ తినకపోతే శరీరం తక్కువ సోడియంకు అడ్జస్ట్ అవడం మొదలు అవుతుంది దీంతో సోడియం లెవెల్స్ డ్రాప్ అవుతాయి. ఆ పరిస్థితులకు శరీరం సర్దుకుంటుంది కూడా. సాధారణంగా సోడియం నీటి శాతాన్ని హోల్డ్ చేయడానికి సహాయపడుతుంది. శరీరంలో అది ఎక్కువ లేకపోతే నీటి శాతం తగ్గుతుంది కాబట్టి వెయిట్ లాస్ అవుతారు. సాల్టీ ఫుడ్స్‌లో చాలా కేలరీలు ఉంటాయి. వీటికి దూరంగా ఉంటే కేలరీల ఇన్‌టెక్ తగ్గి బరువు తగ్గుతారు. ఎందుకంటే సాల్టీ ఫుడ్స్ మానేస్తే హెల్తీ ఫుడ్స్ తింటాం కాబట్టి శరీరంలోని, ముఖ్యంగా కడుపు, నడుము చుట్టూ ఉన్న కొవ్వు తగ్గడానికి స్కోప్ ఉంటుంది. బ్లోటింగ్ వంటి సమస్యలకు గుడ్ బాయ్ చెప్పవచ్చు. అయితే, చాలా త్వరగా బరువు తగ్గితే ఆరోగ్యానికి హానికరం అని మాత్రం గుర్తు పెట్టుకోండి.జీర్ణ సమస్యలు : ఉప్పు డైజెషన్‌కు కూడా అవసరమే. ఉప్పులోని సోడియం స్టమక్ యాసిడ్ తయారు కావడానికి అవసరం. సడన్‌గా సాల్టిఫుట్స్ మానేస్తే డైజెస్టివ్ సిస్టమ్ అడ్జస్ట్ అవదు. సాల్ట్‌కు బదులు ఫైబర్-రిచ్ ఫ్రూట్స్ వంటివి తింటే వాటిని అరిగించుకోవడానికి డైజెస్టివ్ సిస్టమ్‌కు కష్టమైపోతుంది. దీంతో కడుపు నొప్పి, ఇతర అజీర్తి సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. మానసిక ఆరోగ్యం: ఉప్పును పూర్తిగా మానేస్తే బ్రెయిన్ మీద ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ఇది ఒత్తిడి, ఆందోళన వంటి మానసిక సమస్యలకు దారితీస్తుంది. సోడియం శరీరంలోని ఫ్లూయిడ్స్ మెయింటెన్ చేయడానికి అవసరం. ఇది నాడీ వ్యవస్థ పనితీరుకు కూడా ముఖ్యం. సోడియం తక్కువైతే నాడీ కణాల మధ్య కమ్యూనికేషన్ సరిగ్గా జరగక మూడ్ పాడవుతుంది.



## ఈ కాయతో బోలెడన్నీ ప్రయోజనాలు

చేదు ఆరోగ్యానికి మంచి అని తెలిసిన కూడా చాలా మంది తినడానికి ఇష్టపెట్టుకోరు. చేదుగా ఉండే పదార్థాల జోలికి అసలు దగ్గరగా ఉండరు.చేదుగా ఉండే పదార్థాలకు కిలోమీటరు దూరంలో ఉంటారు. అయితే కూరగాయాల్లో కాకరకాయ చేదుగా ఉంటుంది. అసలు దీనిని తినడానికి ఎవరూ ఇష్టపడరు. కాకరకాయను ఎలా వండిన కూడా చేదుగా ఉంటుంది. కనీసం ఏడాదికి కూడా ఒక్కసారి కూడా వీటిని తినరు. ఇందులోని పోషకాలు శరీర ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ కాకరకాయను వారానికి ఒకసారి అయిన తినడం వల్ల అనారోగ్య సమస్యలు బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనిని డైలీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా ఉపయోగపడుతుంది. ఇవే కాకుండా వ్యాధికారక ప్రమాదాల నుంచి కాపాడటంలో కాకరకాయలు ముఖ్య పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల ఇవే కాకుండా ఇంకా బోలెడన్నీ ప్రయోజనాలు ఉన్నాయి. మరి ఈ ప్రయోజనాలేంటో తెలియాలంటే ఆలస్యం చేయకుండా ఈ ఆర్టికల్‌పై ఓ లుక్కేయండి. కాకరకాయలో ఎక్కువగా పాలీపెప్టైడ్-పి అనే ఇన్సులిన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో బాగా సహాయపడతాయి. కాకరకాయ మధుమేహం ఉన్నవారి ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యల నుంచి కాపాడుతుంది. చేదు అనారోగ్య వ్యాధుల నుంచి కాపాడుతుంది. ఇందులోని పోషకాలు చర్మ ఆరోగ్యాన్ని మేలు చేస్తాయి. అలాగే ఈ కాకరకాయ మొక్క ఆకులను పేస్ట్ చేసి తలకు అప్లై చేస్తే చుండ్రు తగ్గుతుంది. చేదు వల్ల తలలో పేలు వంటివి ఉన్న కూడా మాయమైపోతాయి. మీకు నచ్చిన విధంగా కాకరకాయను వండి తినడం వల్ల తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు. దీనిని తినలేమని అనుకునేవారు జ్యూస్ చేసి కూడా తాగవచ్చు. దీని జ్యూస్ తాగితే కిడ్నీ సమస్యలు, మోకాలి నొప్పులు తొందరగా తగ్గుతాయి. ఎలాంటి ఆపరేషన్, మందులు వాడకుండా కిడ్నీలోని రాళ్ల సమస్యలను తగ్గించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కొందరు మైగ్రేన్ సమస్యతో బాధపడుతుంటారు. ఎన్ని మందులు వాడిన ఈ సమస్య తగ్గదు. అలాంటి వారు కాకరకాయ ఆకలను మెత్తగా చేసి దానిని నుదిటిపై రాస్తే.. క్షణాల్లో తలనొప్పి నుంచి విముక్తి పొందుతారు.



# మునగ స్త్రీలకు ఎంతో మేలు చేస్తుంది

మన దేశంలో మునగ ప్రయోజనాలను పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు..? ఇది అందరికీ తెలిసిన విషయమే.. సులువుగా లభించే మునగకాయలను అందరూ ఇష్టపడతారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంట్లో మునగ చెట్టు ఉంటుంది. ఒక్కొక్కరు ఒక్కో రకంగా వాటి నుంచి లభించే మునగకాయలను తింటారు. మునగ రుచి, ఆరోగ్య ప్రయోజనాలు ప్రజలను ఆకర్షిస్తాయి. అయితే.. మునగలో ఉండే విటమిన్ సి, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దగ్గు, జలుబును నివారిస్తాయి. అంతేకాదు, క్యాల్షియం , ఐరన్ మునగలో పుష్కలంగా ఉంటాయి. మగవారికి మునగతో చేసిన వంటకాలు తినాలని చెబుతుంటారు. అయితే.. ఇది మగవారికే కాకుండా.. మహిళలకు కూడా ఎంతో ప్రయోజనాలను కల్గిస్తుంది. మునగలో గర్భిణీ స్త్రీలకు అవసరమైన నియాసిన్, రిబోఫ్లావిన్ , విటమిన్ బి12 వంటి బి విటమిన్లు కూడా ఉన్నాయి. మునగాలోని యాంటీబయాటిక్ ఏజెంట్లు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అలాగే, మునగలో జింక్ ఉంటుంది, ఇది చర్మ సంరక్షణకు చాలా మంచిది. గ్లుటాతియోన్ చర్యను వేగవంతం చేసే లక్షణాలను కూడా మునగ కలిగి ఉంది. శరీరంలో మొటిమలు ఏర్పడటాన్ని తగ్గిస్తుంది. మునగ ఆకు రసం చర్మాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పాలిచ్చే తల్లులు పాల సరఫరాను పెంచడానికి మునగను ఉపయోగిస్తారు. అంతే కాకుండా మురిపంలో ఉండే పొటాషియం, ఐరన్, కాల్షియం, విటమిన్ సి, బి, బీటా కెరోటిన్ , అమినో యాసిడ్స్ తల్లి పాలను పెంచడంలో సహాయపడతాయి. మునగ కొవ్వు తగ్గడానికి , బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మునగలో ఫైబర్ , మోనోశాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఆకలిని అదుపులో ఉంచుతాయి. ఉసిరి ఆకులతో నీరు తాగడం వల్ల కూడా రుతు నొప్పి తగ్గుతుంది. ఉసిరికాయ ఆకులతో నీటిని మరిగించి రోజూ తాగడం వల్ల కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. ఇది కాకుండా, మునగా యొక్క హెపాటోప్రొటెక్టివ్ ఫంక్షన్ కాలేయాన్ని రక్షించడానికి , టాక్సిన్స్ నుండి రక్షించడానికి సహాయపడుతుంది. శరీరంలోని క్యాలరీల పరిమాణాన్ని తగ్గించడంలో కూడా మునగ మంచిది. మునగ లైంగిక ఉద్దీపనలో కూడా సహాయపడుతుంది. మునగలో ఉండే కామోద్దీపన సమ్మేళనం టెస్టోస్టెరాన్ స్థాయిలను పెంచుతుంది. ఆహారంలో మునగ పువ్వును చేర్చుకోవడం కూడా స్పెర్మ్ కౌంట్ పెంచడంలో సహాయపడుతుంది.



# పచ్చి ఉల్లిపాయల ప్రయోజనాలు

మన వంటింట్లో దొరికే కూరగాయలలో ఉల్లిపాయ కూడా ఒకటి. ఈ ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల లాభాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. ఉల్లిపాయను తరచుగా తినడం వల్ల అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఉల్లి చేసే మేలు అంతా ఇంతా కాదు. అందుకే ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని అంటూ ఉంటారు. అయితే కొందరు పచ్చి ఉల్లిపాయలు తింటే మరి కొందరు కూరల్లో తినడానికి ఇష్టపడుతూ ఉంటారు. మనలో చాలామంది పచ్చి ఉల్లిపాయ తినడానికి అసలు ఇష్టపడరు. కానీ చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే ఉల్లిపాయ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయట. మరి పచ్చి ఉల్లిపాయ తింటే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. పచ్చి ఉల్లిపాయల్లో మన శరీరానికి అవసరమైన విటమిన్ సి, విటమిన్ బీ6, కాల్షియం, ఫాస్ఫరస్, పొటాషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాగే పచ్చి ఉల్లిపాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్ తో పోరాడటానికి సహాయపడతాయి. అలాగే ఎన్నో రోగాల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలలో యాంటి క్యాన్సర్ లక్షణాలు కూడా ఉంటాయి. అంటే వీటిని మోతాదులో తింటే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని కొందరు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అలాగే పచ్చి ఉల్లిపాయ డయాబెటిక్ పేషెంట్లకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందట. ఎలా అంటే మధుమేహులు పచ్చి ఉల్లిపాయలను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలను తింటే శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు నార్మల్ గా ఉంటాయట. దీంతో మీ గుండె ఆరోగ్యంగా ఉంటుందని, శరీరంలో కొలెస్ట్రాల్ లెవెల్స్ నార్మల్ గా ఉంటే గుండెపోటు వచ్చే ప్రమాదం తగ్గుతుందని చెబుతున్నారు. ఉల్లిపాయల్లో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. అంటే వీటిని తినడం వల్ల మంట, నొప్పి నుంచి ఉపశమనం కలుగుతాయట. ముఖ్యంగా చలికాలంలో కీళ్లనొప్పుల నొప్పుల నుంచి బయటపడాలంటే పచ్చి ఉల్లిపాయలను మోతాదులో తినడం చాలా మంచిదని చెబుతున్నారు. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తలెత్తవట.



# పళ్ళుతోమకుంటే ఏమవుతుంది..?

చాలా మంది తమ నోటిని దేవుని ఇల్లుగా భావిస్తారు. దానిలోని దంతాలు , ఆ ఒక్క నాలుక అన్ని విధాలుగా నీతిగా , శుభ్రంగా ఉంచబడతాయి. అక్కడ స్వేచ్ఛకు అనుమతి లేదు. అయితే కొన్ని ఉన్నాయి. వారి పొడవాటి నాలుకలను వదులుకోండి. దాంతో వారు గందరగోళానికి గురవుతారు. మరికొందరు పళ్లు తోముకోవడం, శుభ్రంగా ఉంచుకోవడం వంటి పనుల జోలికి వెళ్లరు.కానీ ఆ ప్రాతిపదికన, బ్రషింగ్‌ను ఒకటి లేదా రెండు రోజులు దాటవేయడం పెద్ద విషయంగా అనిపించదు. అయినప్పటికీ, మీ దంత పరిశుభ్రతను చాలా కాలం పాటు నిర్లక్ష్యం చేయడం వలన మీ శరీరం యొక్క మొత్తం ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నోరు మిలియన్ల బ్యాక్టీరియాలకు నిలయం. , మీరు మీ దంతాలను క్రమం తప్పకుండా బ్రష్ చేయకపోతే, బ్యాక్టీరియా సంఖ్య పెరుగుతుంది. ఇది నోటి దుర్వాసన లేదా తడిసిన దంతాల కంటే అనేక సమస్యలకు దారితీస్తుంది. బ్రష్ చేయని మొదటి కొన్ని రోజుల్లో నోటిలో తక్షణ మార్పులు సంభవిస్తాయి మీరు బ్రష్ చేయడం ఆపివేసినప్పుడు గుర్తించదగిన మొదటి మార్పు దంతాల మీద మృదువైన ఫలకం ఏర్పడటం. ఈ ఫలకం బ్యాక్టీరియాతో నిండిపోయి చిగుళ్లను చికాకుపెడుతుంది. ఇది మంటను కలిగిస్తుంది , ఈ ఎర్రబడిన చిగుళ్ళను తాకినప్పుడు లేదా సున్నితంగా బ్రష్ చేసినప్పుడు సులభంగా రక్తస్రావం అవుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, డెంటల్ ప్లేక్ డెంటిన్‌లో డీకాల్సిఫికేషన్‌ను ప్రారంభించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి ఈ వైవిధ్యం ఫలకం మీ దంతాలను నాశనం చేసే ముందు ఎనామెల్ కింద రక్షిత పొరపై 48 గంటలలోపు సంభవిస్తుంది.



# జీరో ఆయిల్ కుకింగ్

ఎప్పుడైనా నూనె రుచి చూశారా? కచ్చితంగా నచ్చదు. కానీ నూనె వల్లే వంట రుచికరంగా ఉంటుందని నమ్ముతాం. అయితే ఆయిల్, నెయ్యి, వెన్నెకు సంబంధించిన ఒక్క చుక్క లేకుండా కూడా టేస్టీ ఫుడ్ ప్రిపేర్ చేయొచ్చని చెప్తున్నారు నిపుణులు.రుచిని త్యాగం చేయకుండా రుచికరమైన భోజనం వండొచ్చని వాగ్దానం చేస్తున్నారు. ప్రస్తుతం జీరో ఆయిల్ కుకింగ్ ట్రెండ్ అవుతుండగా.. ఈ విప్లవాత్మక విధానం, ఉపయోగాల గురించి తెలుసుకుందాం. జీరో ఆయిల్ కుకింగ్ అనేది ఎటువంటి నూనెలు లేదా కొవ్వులను ఉపయోగించకుండా ఆహారాన్ని తయారు చేయడాన్ని సూచిస్తుంది. ఈ వంట పద్ధతి స్టీమింగ్, బాయిల్ చేయడం, గ్రిల్లింగ్, రోస్ట్ చేయడం లేదా ఆహారాన్ని అంటుకోకుండా నిరోధించడానికి నాన్-స్టిక్ కుక్‌వేర్‌లను ఉపయోగించడం వంటి ప్రత్యామ్నాయాలపై ఆధారపడి ఉంటుంది. సుగంధ ద్రవ్యాలు, మూలికలు, నిమ్మకాయ, ఇతర సహజ రుచులను టేస్ట్ మెరుగుపరచడానికి ఉపయోగిస్తారు. తద్వారా నూనె అవసరం లేకుండా ఆహారాన్ని పోషకమైనదిగా, రుచిగా మారుస్తుంది. గుండె ఆరోగ్యం : నూనెను తగ్గించడం, ముఖ్యంగా అనారోగ్యకరమైన కొవ్వులు, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె జబ్బులు, రక్తపోటు, స్ట్రోక్స్ ప్రమాదాన్ని నివారిస్తుంది. నూనెలో సంతృప్త కొవ్వులు ఉంటాయి. ఇవి గుండెకు చాలా అనారోగ్యకరమైనవి. కాబట్టి నూనెను వాడకుండా ఉండటం ద్వారా.. ఈ సంతృప్త కొవ్వులను కూడా వదిలించుకోవచ్చు. వెయిట్ మేనేజ్మెంట్ : నూనెలో కేలరీలు ఎక్కువగా ఉన్నందునా.. మీ ఆహారం నుంచి దానిని తొలగించడం మొత్తం కేలరీల తీసుకోవడం తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది కిలోల బరువు తగ్గడానికి, వెయిట్ మేనేజ్మెంట్ కు సహాయపడుతుంది. నూనెలో కొవ్వు ఉంటుంది. అధిక కొవ్వు అధిక బరువు పెరగడానికి దారితీస్తుంది. కాబట్టి జీరో ఆయిల్ కుకింగ్ బరువు నిర్వహణలో సహాయపడుతుంది. జీర్ణక్రియ మెరుగు :భారీ, జిడ్డుగల ఆహారాలను జీర్ణం చేయడం కష్టం. అజీర్ణం, ఉబ్బరం, ఇతర జీర్ణ సమస్యలకు దారితీయవచ్చు. నూనె లేకుండా వంట చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. నూనె లేకుండా, నూనె రహిత వంటకాలు చేసేందుకు కూరగాయలు, ధాన్యాలపై ఎక్కువ దృష్టి పెట్టడం వలన ఎక్కువ ఫైబర్ తీసుకునేందుకు కారణమవుతుంది. దీనివల్ల జీర్ణక్రియ సులభమవుతుంది.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem


# పంద్రాగస్ట్ పోటీలో సూర్య, నయనతార





తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆధవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు.సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ / సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్య్ర దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణెళిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్య్ర దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.


## షూటింగ్‌లో గాయపడ్డ బాలయ్య




నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం గోపిచంద్ మలినేని దర్శకత్వంలో ఓ సినిమా చేస్తుండగా, ఈ చిత్ర షూటింగ్ తాజాగా కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతుంది. అయితే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసరాలలో కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా, ఆయన అనుకోకుండా కాలు జారి కిందపడిపోయారు. దాంతో ఆయన మోకాలిక స్వల్ప గాయం అయింది. వెంటనే చిత్ర బృందం షూటింగ్ ఆపేసి బాలయ్యని సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్య బృందం ఇతర పరీక్షలు కూడా నిర్వహించారు. స్వల్ప గాయమే అయిందని, కంగారు పడాల్సిన పనిలేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే కొన్ని రోజుల పాటు బాలయ్య విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్టు సమాచారం. ఇక సినిమాల విషయానికి వస్తే.. గోపిచంద్ మలినేనితో పాటు కొరటాల దర్శకత్వంలోను బాలయ్య ఓ చిత్రం చేస్తున్నాడు. కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువసుధ ఆర్ట్స్, ఎస్ఎల్‌వీ సినిమాస్ సంస్థలు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నాయి. బాలకృష్ణ ఈ సినిమాలో గత చిత్రాలకు భిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని, మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో కూడిన మాస్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కుతుందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వచ్చే ఏడాది సమ్మర్‌లో సినిమాను విడుదల చేయాలనే లక్ష్యంతో మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## రామ్‌చరణ్‌తో సుకుమార్ మూవీ

### హీరోయిన్‌గా రష్మిక అంటూ ప్రచారం




క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం సినిమా స్క్రిప్ట్ పూర్తిగా సిద్ధమైనట్లు తెలుస్తుండగా, ఇప్పుడు హీరోయిన్ ఎంపిక టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అయితే సుకుమార్ కెరీర్‌ను పరిశీలిస్తే ఒక ఆసక్తికరమైన విషయం కనిపిస్తుంది. 'ఆర్య' నుంచి 'పుష్ప 2' వరకు ఆయన తెరకెక్కించిన ప్రతి సినిమాలో కొత్త హీరోయిన్‌కే అవకాశం ఇచ్చారు. ఒకసారి నటించిన కథానాయికను వెంటనే మరో సినిమాలో రిపీట్ చేయలేదు. ఇదే ఆయనకు సెంటిమెంట్‌గా మారింది. అయితే ఈసారి రామ్ చరణ్ సినిమా కోసం ఆ సెంటిమెంట్‌ను పక్కన పెట్టే ఆలోచనలో ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం పలువురు నటీమణుల పేర్లు పరిశీలించినప్పటికీ, రష్మిక మందన్న పేరు ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. దర్శకుడు సుకుమార్‌తో 'పుష్ప', 'పుష్ప 2' చిత్రాల్లో రష్మిక సక్సెస్‌ఫుల్‌గా పనిచేయడంతో, మరోసారి ఆమెనే ఎంపిక చేయాలనే అభిప్రాయం టీమ్‌లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. రామ్ చరణ్, రష్మిక మందన్న ఇప్పటివరకు ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు. ఈ ఫ్రెష్ పెయిర్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని చిత్రబృందం భావిస్తోందట. అంతేకాకుండా ప్రస్తుతం రష్మిక పాన్ ఇండియా స్థాయిలో వరుస విజయాలతో దూసుకుపోతుండటం కూడా నిర్మాతలకు అదనపు బలంగా మారింది. ఆమె క్రేజ్ సినిమాకు అన్ని భాషల్లో మంచి బిజినెస్‌కు దోహదపడుతుందనే అంచనాలు ఉన్నాయి. ఒకవేళ రష్మికనే హీరోయిన్‌గా ఖరారు చేస్తే, సుకుమార్ తన కెరీర్‌లో తొలిసారి ఒకే హీరోయిన్‌ను వరుసగా రెండు చిత్రాల్లో తీసుకున్న దర్శకుడిగా నిలుస్తారు. అయితే ప్రస్తుతం ఇవన్నీ ప్రచారంలో ఉన్న వార్తలే. చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే హీరోయిన్ ఎంపికపై పూర్తి స్పష్టత రానుంది.

## ఎన్టీఆర్, త్రివిక్రమ్ గాడ్ ఆఫ్ వార్

యంగ్ టైగర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టుల్లో 'గాడ్ ఆఫ్ వార్' ఒకటి. స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తెరకెక్కించనున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన కాన్సెప్ట్ పోస్టర్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచగా.. ఇప్పుడు హీరోయిన్‌కు సంబంధించిన వార్తలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ కియారా అద్వానీ పేరును పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ చిత్రం పురాణ గాథల స్ఫూర్తితో రూపొందనున్న మైథలాజికల్ యాక్షన్ డ్రామా అని వార్తలు వస్తుండగా.. ఎన్టీఆర్ ఇందులో శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నట్లు టాక్. కథలో కీలకమైన మహిళా పాత్రకు కియారా సరిపోతారని మేకర్స్ భావిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎన్టీఆర్, కియారా అద్వానీ ఇప్పటికే 'వార్ 2' చిత్రంలో కలిసి నటించిన సంగతి తెలిసిందే. అయితే ఆ సినిమాలో వారి మధ్య పూర్తి స్థాయి జోడీ కనిపించలేదు. కియారా నటించిన 'భరత్ అనే నేను' ఘన విజయం సాధించగా, రామ్ చరణ్‌తో చేసిన 'వినయ విధేయ రామ', 'గేమ్ ఛేంజర్' ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయాయి. దీంతో కొందరు అభిమానులు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో సెంటిమెంట్‌గా చర్చిస్తున్నారు. నటుడు సిద్దార్థ్ మల్హోత్రాను వివాహం చేసుకున్న తర్వాత కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతున్నారు. మరోవైపు ఎన్టీఆర్ ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'డ్రాగన్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమా పూర్తయిన తర్వాతే త్రివిక్రమ్ దర్శకత్వంలోని 'గాడ్ ఆఫ్ వార్' సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉందని సమాచారం.

# సింహాద్రి సన్నివేశంపై రాజమౌళి ఆసక్తికర వ్యాఖ్య




దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అత్యంత గుర్తింపు పొందిన భారతీయ దర్శకుల్లో ఒకరిగా నిలిచారు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇప్పుడు మహేష్ బాబు హీరోగా తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ వారణాసి తో మరోసారి ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. విదేశాల్లో నిర్వహిస్తున్న ప్రమోషనల్ ఈవెంట్లలో రాజమౌళి చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన ఓ ఇంటరాక్షన్ కార్యక్రమంలో పాల్గొన్న రాజమౌళి.. సినిమా నిర్మాణంలో ఎదురయ్యే సవాళ్ల గురించి మాట్లాడారు. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కించిన 'సింహాద్రి' చిత్రంలోని ఓ కీలక సన్నివేశాన్ని రాజమౌళి ప్రస్తావించారు. 'సింహాద్రి' సినిమాలో హీరో ఒక మంచి వ్యక్తిని చంపాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు. సాధారణంగా హీరో చేత అలాంటి పని చేయించడం ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారనే సందేహాలు తన కుటుంబ సభ్యులు, టీమ్‌లో చాలామందికి ఉన్నాయని చెప్పారు. అయితే కథలో ఆ సంఘటన వెనుక బలమైన కారణం ఉందని, ఆ మంచి వ్యక్తిని హీరో చంపకపోతే వేలాది మంది అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని ఆయన వివరించారు. ఆ భావోద్వేగాన్ని ప్రేక్షకులకు బలంగా చేరవేయగలిగితేనే ఆ సన్నివేశం పనిచేస్తుందని తాను నమ్మానని రాజమౌళి వెల్లడించారు. దర్శకుడిగా కొన్ని సందర్భాల్లో కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని, కథ చెప్పే విధానంపై నమ్మకం ఉంటే అలాంటి రిస్క్‌లు తీసుకోవాల్సిందేనని ఆయన పేర్కొన్నారు.